

రాజధాని రైతుల భారీ ర్యాలీ (పాతచిత్రం)

మొక్కవోని.. మహోద్యమం

రాజధాని గ్రామాల్లో కొత్త కాంతులు

మరో మూడు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు రానుండడంతో రాజధాని గ్రామాల్లో కొత్త వెలుగులు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం మారుతుం దన్న సంకేతాలతో ఇప్పటి వరకు కోల్పోయిన సంతోషం రాజధానివాసుల్లో తిరిగి వచ్చినట్లనిపిస్తోంది. రాజధాని భూముల ధరల్లో కనిపిస్తోన్న పెరుగుదల.. నాలుగున్నరేళ్ల క్రితం ఆగిపోయిన స్థలాల క్రయ, విక్రయాలు తిరిగి తెరమీదకి రావడంతో రైతు ల్లో కొత్త ఆశలు చిగురి స్తున్నాయి. టీడీపీ, జనసేన అధినేతలు ఇరు వురూ మందడం గ్రామంలో 'భోగి సంకల్పం' చేపట్టడం.. వచ్చే ఏడాది ఇదే రాజ దానిలో సంక్రాంతి సంబరాలు అధికా రికంగా జరుపుకుంటా మని, ప్రజా రాజధాని అమరావతి నుం చే రాష్ట్ర ప్రజలందరికీ సంక్షేమ పాలన అందిస్తానని చంద్ర బాబు చేసిన హామీ వారి స్థైర్యాన్ని పెంచింది. బంగా రంలాంటి రాజధానిని నిర్మించు కుందాం అంటూ జనసే నాని పవన్ ఇచ్చిన హామీ వారి సంతోషాన్ని రెట్టింపు చేసింది.



మందడంలో జరిగిన సంక్రాంతి వేడుకల్లో చంద్రబాబు, పవన్‌కల్యాణ్

అజరామరంగా అభివృద్ధి చెందాల్సిన అమరావతి పోరుబాటలో అలుపెరగకుండా సాగుతోంది. భూ ములు ఇచ్చి అభివృద్ధి ఫలాలను అనుభవించాల్సిన రైతులు సమరం సాగిస్తోన్నారు. గత పాలకుల కంటే మిన్నగా అమరావతిని అభివృద్ధి చేస్తామని గద్దెను ఎక్కి మూడు రాజధానులంటూ అమరావతి ని పాడుపెట్టిన వైసీపీ ప్రభుత్వంపై రైతులు, మహిళ లు మొక్కవోని దీక్షతో మహోద్యమం చేస్తోన్నారు. రోజులు కాలగమనంలో కరిగిపోతుండగా అన్యాయంపై రాజధాని రైతులు, బహుజనులు, కూలీలు సాగిస్తున్న సమరం అజరామరంగా సాగిపోతూనే ఉంది. పండుగలు.. పర్వదినాలు.. ఉత్సవాలు.. సంబరాలు అన్నీ దీక్షా శిబిరాల్లోనే. పోలీసుల లాఠీ లు.. కేసులు.. అరెస్టులు.. పాలకుల సూటిపోటి మాటలు.. వేధింపులకు వెరవకుండా అలుపె రగకుండా పోరు సాగిస్తున్నారు. ఎన్ని ఆటుపోట్లు.. ఆటంకాలు వచ్చినా అవిశ్రాంతంగా అమరావతి రైతులు సాగిస్తున్న పోరాటం 1500వ రోజుకు చేరింది. అమరావతి ఉద్యమాన్ని ఎలాగైనా అణచి వేయాలని పాలకుల పన్నాగాలు, కుట్రలను వమ్ము చేస్తూ అంతకంతకూ బలంగా అమరావతి ఉద్య మం ముందుకు సాగుతూనే ఉంది.

అమరావతి పోరుకు 1500 రోజులు

- రాజధాని ఉద్యమంలో మరో మైలురాయి
- లాఠీలు, మాటల తూటాలకు తలొగ్గని పోరాటం
- వేల మందిపై కేసులు, వందల మంది అరెస్టులు
- సానుకూల పరిణామాలతో రైతుల్లో కొత్త కాంతులు



గుంటూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అమరావతి పోరు.. మహోజ్వల భవిష్యత్ కోసం మట్టి మనుషులు చేసిన మహా పోరాటమది. నమ్మించి గొంతు కోసిన పాలకులపై అలుపెరుగని రణమది. రైతుల త్యాగాలు, ఆత్మ బలిదానాలతో అమరావతి ఉద్యమం అజరామరంగా సాగుతూ గురువారంతో మరో మైలురాయిని చేరింది. రాజధాని రైతులు, మహిళలు, రైతుకూలీలు, దళిత బహుజనులు, మైనారిటీలు ఏకమై మొక్కవోని దీక్షతో ఉద్యమాన్ని ముందుకు నడిపిస్తున్నారు. పోలీసుల నిర్బంధాలు, కవాతులు, లాఠీల కరాళ నృత్యాలు, రక్తమోడుతున్న గాయాలు.. వారి పోరాట పటిమను దెబ్బతీయలేకపోయాయి. అందుకే 1500 రోజులుగా ఆ మహా మహోద్యమం మరిచిపోలేని విజయాలతో ముందుకు సాగుతూనే ఉంది. దేశ చరిత్రలోనే ఇంత సుదీర్ఘకాలం పాటు క్రియాశీలకంగా సాగిన ఉద్యమం మరొకటి లేదంటే అతిశయోక్తి కాకపోవచ్చు. రాజధాని నిర్మాణంపై ఎన్నో ఆశలతో ఎదురు చూస్తున్న వారికి 2019 డిసెంబరు 17న ముఖ్యమంత్రి జగన్ శాసన సభలో చేసిన మూడు రాజధానుల ప్రకటన భూములిచ్చిన రైతులను కుదిపేసింది. ఆ మర్నాటి నుంచే రాజధాని ఉద్యమం మొదలైంది. తొలుత రాజధాని గ్రామాలైన తుళ్లూరు, మందడం, కృష్ణాయపాలెం, ఎర్రబాలెం గ్రామాల్లో మొదలైన ఉద్యమం క్రమంగా అన్ని గ్రామాలకు విస్తరించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు సాగుతున్న రైతుల ఉద్యమానికి అధికార వైసీపీ మినహా మిగిలిన పార్టీలన్నీ సంఘీభావం ప్రకటించాయి. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేనాని పవన్ కల్యాణ్, అప్పటి బీజేపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ, సీపీఐ, సీపీఎం కార్యదర్శులు రామకృష్ణ, మధు తదితరులు రాజధాని గ్రామాల్లో పర్యటించి రైతులకు అండగా నిలిచారు. కరోనా లాక్‌డౌన్‌లోనూ రైతులు నిరసనలు, దీక్షలను కొనసాగించారు.

చరిత్రలో నిలిచిపోయేలా..

1500 రోజుల మైలురాయిని చేరిన అమరావతి మహోద్యమం రాష్ట్ర చరిత్ర లోనే కాదు, దేశ చరిత్రలోనే నిలిచిపోయే ఉద్య మంగా కీర్తిగడించింది. మహిళలు స్నానం చేస్తున్న సమయంలో స్నానపు గదులపై డ్రోన్ కెమేరాలను తిప్పడాన్ని అడ్డుకున్నందుకు 40 మందిపై కేసులు నమోదు చేసి 20 రోజులపాటు జైలుపాలు చేశారు. మొత్తం ఉద్యమ క్రమంలో 2500 మందిపై పోలీసులు అక్రమ కేసులు బనాయించారు. 1500 రోజుల ఉద్యమకాలంలో దాదాపు 250 మంది ఉద్యమకారులు అశువులు బాశారు. రెండు రోజుల క్రితం దళిత జేఏసీ నేత గడ్డం మార్టిన్ లూథర్ గుండెపోటుతో చనిపోవడం రైతులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. తొలిరోజు ఎంత బలంగా మొదలైందో నేటికీ అదే బలంతో ముందుకు సాగుతోంది.



మూడు రాజధానుల జీవో ప్రతులను తగలబెడుతూ..

నేడు మందడం, వెలగపూడిలో కార్యక్రమాలు

తుళ్లూరు: అమరావతినే రాష్ట్ర ఏకైక రాజధానిగా కొనసాగించాలని రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తోన్న ఉద్యమం గురువారం నాటికి 1500వ రోజుకు చేరుకున్న సందర్భంగా మందడం, వెలగపూడిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మందడం పోలేరమ్మ గుడి ఆవరణలో ఉద్యమ కార్యక్రమాలకు వేదికను ఏర్పాటు చేశారు. వెలగపూడి ధర్నా శిబిరం ఎదురుగా ఉన్న స్థలంలో మరో వేదిక ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాలకు వైసీపీ తప్ప అన్ని రాజకీయ పార్టీల నేతలను, దళిత, ముస్లిం మైనార్టీ, రైతు సంఘాల నేతలను అమరావతి జేఏసీ ఆహ్వానించింది. రాబోయే రోజుల్లో ఉద్యమ కార్యాచరణపై నాయకులు ప్రసంగించనున్నారు. రాజధాని 29 గ్రామాలకు చెందిన ప్రజలు ఈ కార్యక్రమాలలో పాల్గొనాలని జేఏసీ నాయకులు పిలుపు ఇచ్చారు.

అపూర్వ ఘట్టాలు..

మూడు రాజధానుల ప్రకటనకు వ్యతిరేకంగా 2019 డిసెంబరు 19న రాజధాని రైతులు బంద్‌కు పిలుపు ఇవ్వగా వారికి మద్దతుగా గుంటూరు, విజయవాడతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఆందోళనలు జరిగాయి. అనూహ్య స్పందనతో ప్రభుత్వం 30 యాక్ట్, 144, సెక్షన్లతో రాజధాని గ్రామాలను తన గుప్పిట బంధించింది. వందలాదిమంది పోలీసులు రాజధాని గ్రామాల్లో కవాతులు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు. అయినా ఉద్యమం ఆగలేదు.

- 2020 జనవరి 3న ఉద్యమం చేస్తున్న అమరావతి మహిళలపై పోలీసులు దాడి చేశారు. దీనికి నిరసనగా రాజధాని గ్రామాలు బంద్ నిర్వహించాయి.
- 2020 జనవరి 10న దుర్గమ్మకు ముడుపులు చెల్లించుకునేందుకు వెళుతున్న మహిళలపై పోలీసులు దాడి చేశారు. గుంటూరు ఎస్పీ విజయరావు లాఠీలతో మహిళలపై విరుచుకుపడ్డాడు.
- 2020 జనవరి 20న అమరావతి జేఏసీ అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చింది. ఈ ముట్టడిని భగ్నం చేయడానికి ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం చేయని ప్రయత్నం లేదు. పోరాటంలో రైతులు, మహిళలపై జరి గిన ఆకృత్యాలు అన్నీ ఇన్నీ కావు.
- 2020 ఏప్రిల్ 7న జాతీయ రహదారి దిగ్బంధనం కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తిచేశారు.
- జూలై 4న 200వ రోజు సందర్భంగా రాష్ట్రంలోని 175 అసెంబ్లీ స్థానాల్లో రైతులకు సంఘీభావంగా ప్రజలు దీక్షలు చేపట్టారు. 200 నగరాల నుంచి ఎన్‌ఆర్‌ఐలు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు.
- అక్టోబరు 12న 300 రోజు సందర్భంగా ప్రాణాలు కోల్పోయిన రైతులకు నివాళిగా తుళ్లూరులో రాజధాని గ్రామాల రైతులు 'ఆత్మబలిదాన యాత్ర' పేర భారీ ప్రదర్శన నిర్వహించారు.
- డిసెంబరు 31న 'చలో గుంటూరు జైలు' కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. కార్యక్రమంలో పాల్గొన్న మహిళలను పోలీసులు ఈడ్చి పారేశారు.
- 2021 జనవరి 20న 400 రోజు సందర్భంగా రైతులు చేపట్టిన 'రాజధాని సంకల్ప ర్యాలీ' నిర్వహించారు.
- 2021 నవంబరు 1 చేపట్టిన న్యాయస్థానం టూ దేవస్థానం పాదయాత్ర ఉద్యమ స్వరూపాన్ని పూర్తిగా మార్చేసింది. 57 రోజుల పాటూ సాగిన ఈ సుదీర్ఘ పాదయాత్రలో రైతులు వందల మైళ్లు నడుచుకుంటూ స్వామివారి సన్నిధి చేరుకున్నారు.
- 2022 ఫిబ్రవరి 24న 800వ రోజు సందర్భంగా రాజ ధాని రైతులు అమరావతి ప్రజాదీక్ష పేరుతో దీక్ష చేపట్టారు. 24 గంటల నిరసన దీక్షలో 800 మంది, 12 గంటల దీక్షలో 2000 వేల మంది పాల్గొని నిరాహార దీక్ష చేశారు.
- 2022 సెప్టెంబరు 12కి అమరావతి ఉద్యమం మొదలై వెయ్యి రోజులు పూర్తయింది. ఆ సందర్భంగా అమరావతి టూ అరసవిల్లి పేరిట 630 కిలో మీటర్ల మేర మహాపాదయాత్రకు రైతులు శ్రీకారం చుట్టారు. పోలీసుల నిర్బంధాలు, వైసీపీ మూకల దౌర్జన్యాలను ఎదుర్కొంటూ రైతులు పాదయాత్ర కొనసాగించారు.
- 1300 రోజుకు చేరిన సందర్భంగా 2023 జూలై 9న అమరావతి రాజధాని ఐక్య కార్యచరణ సమితి, అమరావతి పరిరక్షణ సమితి సంయుక్తంగా 'నాలుగేళ్ల నరకంలో నవనగరం' కార్యక్రమం నిర్వహించారు.
- అక్టోబరు 17 నాటికి 1400 రోజులకు చేరింది. ఆ సమయంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అక్రమ కేసుల్లో అరెస్టై రాజమండ్రి కేంద్ర కారాగారంలో ఉన్నారు. దీంతో రైతులు రాజధాని నిర్మాణం కోసం, రాజధాని సృష్టికర్త చంద్రబాబు విడుదల కోసం తుళ్లూరు దీక్షా శిబిరంలో గాయత్రి, గణపతి, నవగ్రహ, కాల భైరవ, చండీ హోమాలు నిర్వహించారు.



రాజధాని మహిళలపై లాఠీచార్జి చేస్తున్న పోలీసులు



రైతుల జలదీక్ష



అమరావతి మహిళల పోస్టు కార్డుల ఉద్యమం



పొలాలు ఇచ్చిన రైతులపై లాఠీ ప్రయోగిస్తూ..



ఉత్తిపోతల

- పద్నాలుగేళ్లుగా మూలన పేటసన్నిగండ్ల ఎత్తిపోతల
- నిర్లక్ష్యపు నీడన జెర్రివాగు ఎత్తిపోతల
- కోట్ల రూపాయల ప్రజా ధనం వృథా
- ఎత్తిపోతల పథకాల పర్యవేక్షణలో నేటి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేమి

మాచర్ల, జనవరి 24: పొలాల సాగుకు నీటిని అందించాల్సిన ప్రాథమిక బాధ్యత ప్రభుత్వాలదే.. నదులు, చెరువులు, నీటి కుంటలు, బోర్ల ద్వారా పొలాలకు నీరందిస్తే అంతకన్నా కావాల్సిందేముంది.. పోలవరం లాంటి ప్రాజెక్టులను నిర్మించడం చేతకాకున్నా నీటి పారుదల కొంచెమైనా లేని ఎగువ ప్రాంతాల్లో ఎత్తిపోతల పథకాలు నిర్మించడం, వాటిని పర్యవేక్షించడం వంటి వ్యవహారాల్లో ప్రభుత్వాలకు చిత్తశుద్ధి అవసరం.. అది లేని ప్రభుత్వాలు ఏర్పడితే కోట్ల రూపాయల నిధుల వృథాతోపాటు మళ్లీ పంటలకు నీటి సమస్య ఎదురై ఆయా ఆయకట్టు రైతాంగం కుదేలవక తప్పదు.. అటువంటి పరిస్థితులే పల్నాడులో ఎదురయ్యాయి.

పేటసన్నిగండ్ల ఎత్తిపోతల అలా..

పల్నాడులోని కారంపూడి మండలంలో పేటసన్నిగండ్ల గ్రామం వద్ద సుమారు 1,500 ఎకరాల బీడు భూములకు నీరందించాలని 2004లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తిపోతల పథకాన్ని ఆమోదించింది. నిర్మాణమే కుంటి నడకన సాగుతూ 2010లో ఆ పథకం పూర్తి చేసుకొని అందుబాటులోకి వచ్చింది. దీనికైన వ్యయం అప్పట్లో రూ.3.85 కోట్లు. ఆయకట్టు పరిధిలోని ప్రతి ఎకరం తడిచేలా పైపులైను నిర్మాణం, దానికి తగ్గ స్థాయిలో మోటార్ల ఏర్పాటు జరిగిపోయాయి. కానీ పర్యవేక్షణ లోపంతో అసలా పథకమే కనుమరుగైంది. వర్షాలు లేక ఒకట్రెండు ఏళ్లు నాగులేటికి నీరు రాకపోవడంతో అప్పుడు పథకం తాత్కాలికంగా నిలిచింది. తరువాత తగ్గస్థాయిలో నీళ్లున్నా మోటార్ల రిపేర్లు, పైపులైను లీకేజీలు వేధించాయి. ఎన్నిసార్లు మరమ్మతుల కోసం సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించింది లేదు. క్రమేణా మోటార్లు పూర్తిగా తుప్పుపట్టిపోయాయి. పైపులైను అస్తవ్యస్థమైంది. రమారమి పద్నాలుగేళ్ల నుంచి దాన్ని బాగుచేద్దామన్న ఆలోచనే అటు అధికారులకు, ఇటు ప్రభుత్వానికి రాలేదు.

జెర్రివాగు ఎత్తిపోతల ఇలా..

సాగునీటి వ్యవహారాల్లో ముందుచూపుండే టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు వెయ్యి అడుగుల బోర్లు దింపినా నీరు పడని వెల్దుర్తి మండలంలో జెర్రివాగు ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేశారు. సుమారు రూ.8 కోట్లతో ఈ పథకాన్ని పూర్తి చేశారు. తదుపరి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఈ పథకాన్ని ప్రారంభించింది. మండలంలోని గొట్టిపాళ్ల, కండ్లకుంట, గొట్టిపాళ్ల పరిధిలోని 3,200 ఎకరాలకు నీరందించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశం. అయితే రెండేళ్లపాటు పథకం సజావుగా సాగినప్పటికీ ఆ తదుపరి చతికలపడింది. టీడీపీ అనంతరం వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. 2014లో మరోమారు టీడీపీ అధికారంలోకి వచ్చింది. పథకం నిర్వహణ బాధ్యత పూర్తిగా రైతు కమిటీలకు అప్పజెప్పినప్పటికీ ఉదారతగా రూ.60 లక్షలు నిధులు మంజూరు చేసి మోటార్లు, పైపులైను మరమ్మతు పనులు జరిపి వినియోగంలోకి తీసుకొచ్చింది. తదుపరి ఐదేళ్లపాటు పూర్తిస్థాయిలో నీటిని అందించింది కూడా. అయితే టీడీపీ అధికారం కోల్పోవడంతో ఈ పథకాన్ని ఎవరూ పట్టించుకోలేదు. దీంతో ఈ పథకం కూడా కొండెక్కింది. మోటార్లు పూర్తిగా తుప్పుపట్టిపోగా రైతులు పైపులైన్ల తొలగించి సాగు కోసం భూమి చదును కూడా చేశారు. దీంతో కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన పథకాలు వృథాగా పడి ఉన్నాయి. పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం వెరసి రైతుకు కన్నీటిని మిగిల్చింది.





జెర్రివాగు ఎత్తిపోతల పథకం

ఇవేం ప్రశ్నలు

- పందులున్నాయా.. కుక్కలున్నాయా?
- కులగణనలో వలంటీర్ల ప్రశ్నలపై ఆశ్చర్యం
- పనిలో పనిగా ప్రజల ఆస్తి వివరాల సేకరణ
- సచివాలయ సిబ్బంది ప్రశ్నలతో విస్తుపోతున్న ప్రజలు
- ఎన్నికల తరుణంలో సమగ్ర డేటా సేకరణపై అనుమానాలు

గుంటూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మీకు పందులున్నాయా.. ఎన్ని కుక్కలున్నాయి.. గేదెలు.. గొర్రె లు.. ఇతర పశువులు ఏమన్నా ఉన్నాయా.. అని వలంటీర్ల లెక్కలు తీస్తున్నారు. జీవాలు, కుక్కలు, పశువుల లెక్కలు ఎందుకు తీస్తున్నారో తెలియదు. సరే ఇదేమన్నా పశువుల గణనా అంటే కాదు.. కులగణన సర్వే జరుగుతుంది. కులగణన సర్వేలో పశువులు, కుక్కల వివరాలు ఎందుకో ఎవరికీ అర్థం కావడంలేదు. కులగణనలో పశువుల సంఖ్యకి సంబంధం ఏమిటో వైసీపీ ప్రభుత్వానికే తెలియాలి. స్మార్ట్‌ఫోన్‌లో సర్వే యాప్ లోడ్ చే సుకుని ఇంటింటికి వస్తోన్న వలంటీర్లు, సచివాలయాల సెక్రటరీలు అడుగుతున్న ప్రశ్నలతో ప్రజలు విస్తుపోతున్నారు. సర్వేలో 13వ ప్రశ్నకు సంబంధించి మీకుటుంబానికి గేదె/ఆవు/ఎద్దులు ఎన్ని ఉన్నాయి, గొర్రె/మేకలు, పందులు, కోళ్లు, ఇతరాలు ఉన్నాయా అని ప్రశ్నిస్తున్నారు. కొన్ని ప్రశ్నలకు పౌరుల సమాధానంతో పని లేకుండా వలంటీర్లే టిక్కులు కొట్టేస్తున్నారు. వ్యవసాయ, నివాస భూమి విస్తీర్ణం, వృత్తి, విద్యార్హత, మతం, రేషన్‌కార్డు, వైవాహిక స్థితిని కూడా అ డుగుతున్నారు. సార్వత్రిక ఎన్నికలు మరి కొద్ది రోజుల్లో జరగబోతున్న ప్రస్తుత తరుణంలో వలంటీర్ల ద్వారా సమగ్ర డేటాని సేకరిస్తుండటంపై అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. జిల్లా వ్యాప్తంగా కులగణన ఇప్పటికే ప్రారంభమైంది. అన్ని పనులను పక్కన పడేసి వలంటీర్లు, సచివాలయాల సెక్రటరీల ద్వారా ఈ ప్రక్రియని ప్రభుత్వం పూర్తి చేయిస్తోన్నది. ఈ నెల 28వ తేదీ లోపు కుల గణన పూర్తి కావాలని ఆదేశాలు జారీ చేసింది. అలానే పూర్తి చేసిన సర్వే పరిశీలనని ఫిబ్రవరి 15వ తేదీ నాటికి ముగించాలని పేర్కొన్నది. వలంటీర్ల ఫోన్లకు యాప్ లోడింగ్ చేసి ఇంటింటికి పంపుతు న్నది. ఒక్కో సచివాలయ కార్యదర్శికి 200 ఇళ్లు కేటాయించింది. తొలుత వలంటీర్ వెళ్లి సంబంధిత కుటుంబంలో ఎవరో ఒకరితో ఈకేవైసీ చేసి సర్వే ఫారంని ఆన్‌లైన్‌లో నింపుతారు. దానిని వలంటీర్, ఆ తర్వాత సచివాలయ కార్యదర్శి వేలిముద్ర వేసి ఆమోదిస్తున్నారు.



కులగణన సర్వే నిర్వహిస్తున్న సచివాలయాల సెక్రటరీలు, వలంటీర్లు

సర్వేలో మొత్తం 13 ప్రశ్నలు

సర్వేలో మొదటి 10 ప్రశ్నలు కుటుంబ ఐడీ, జిల్లా పేరు, కోడ్, మండలం, పంచాయతీ, నివాస ప్రాంతం పేరు, వార్డు సంఖ్య, కుటుంబ పెద్ద పేరు, కుటుంబ పెద్దతో ఉన్న సంబంధం, కుటుంబ సభ్యుల సంఖ్య, ప్రస్తుత చిరునామా, ఇంటి కేటగిరి ఉన్నాయి. ఆ తర్వాత వ్యక్తిగత మరుగుదొడ్డి, కుళాయి కనెక్షన్ గురించి అడుగుతున్నారు. 13వ ప్రశ్నలో పశువుల సంఖ్య చెప్పమంటున్నారు. అలానే వంట గ్యాస్ గురించి అడుగుతున్నారు. ఇక విభాగం-2లో వ్యక్తిగత వివరాలు సేకరిస్తున్నారు. జీవనస్థితి, లింగం, వైవాహిక స్థితి, కులం, ఉపకులం, మతం, రేషన్‌కార్డు, విద్యార్హత, వృత్తి, ఆస్తి వివరాలను చెప్పమంటున్నారు. కొన్ని ప్రశ్నలు ఇబ్బంది కలిగించేవిగా ఉండటంతో చాలామంది నిరాకరిస్తున్నారు. అయినప్పటికీ వలంటీర్లు వారికి తోచిన విధంగా టిక్కులు కొట్టేస్తున్నారు. ఈ డేటాకి ఎలాంటి గోప్యత, భద్రత లేదు. రేపు ఎన్నికల సమయంలో దీనిని అధికార వైసీపీ దుర్వినియోగం చేసే అవకాశం లేకపోలేదన్న అనుమానాలు వ్యక్తమౌతున్నాయి.

థగ్‌లైఫ్ షూటింగ్ మొదలైంది..



కమల్‌హాసన్ ఎంత గొప్ప నటుడో అంత స్టార్ కూడా. స్టార్‌గా ఆయన స్థామినాకు 'విక్రమ్' విజయమే నిదర్శనం. 120 కోట్ల నిర్మాణ వ్యయంతో రూపొందిన 'విక్రమ్' దాదాపు 500కోట్ల వసూళ్లను రాబట్టింది. త్వరలో 'భారతీయుడు2'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు కమల్. ఇక ఆయన రీసెంట్‌గా ఓకే చేసిన క్రేజీ ప్రాజెక్ట్ 'థగ్‌లైఫ్'. మణిరత్నం ఈ సినిమాకు దర్శకుడు. 36ఏళ్ల క్రితం కమల్, మణిరత్నం కలయికలో వచ్చిన 'నాయకుడు' ఎంతటి విజయాన్ని సాధించిందో తెలిసిందే. సదరన్ టాప్ 10 కల్ట్‌మూవీస్‌లో అగ్రస్థానంలో 'నాయకుడు' ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు. మళ్లీ ఇన్నాళ్ల తర్వాత కమల్, మణిరత్నం చేతులు కలిపారు. అనౌన్స్‌మెంట్‌తోనే దేశవ్యాప్తంగా ఈ ప్రాజెక్ట్ చర్చనీయాంశమైంది. ఇదిలావుంటే.. బుధవారం ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ మేకర్స్ ఓ వీడియోను విడుదల చేశారు. దుల్కర్‌సల్మాన్, జయంరవి, గౌతం కార్తీక్, జోజు జార్జ్, త్రిష, ఐశ్వర్యలక్ష్మి ఇందులో ప్రధాన పాత్రలు పోషించనున్నట్టు తెలుస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా అంచనాలున్న ఈ చిత్రాన్ని మణిరత్నం, ఆర్.మహేంద్రన్, శివ అనంత్‌తో కలిసి కమల్‌హాసన్ నిర్మిస్తున్నారు. ఉదయనిధి స్టాలిన్ సమర్పకుడు. ఈ చిత్రానికి సంగీతం: ఏ.ఆర్.రెహమాన్, కెమెరా: రవి కె.చంద్రన్.



నా కెరీర్‌లో ఇది చాలా స్పెషల్ మూవీ

సుహాస్

సుహాస్ హీరోగా రూపొందిన 'అంబాజీపేట మ్యారేజి బ్యాండ్' చిత్రం ఫిబ్రవరి 2న విడుదల కానుంది. దుష్యంత్ కటికినేని దర్శకత్వంలో ధీరజ్ మొగిలినేని నిర్మించారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'కొన్ని రియలిస్టిక్ ఇన్సిడెంట్స్ ఆధారంగా ఈ సినిమాను రూపొందించాం. లవ్‌స్టోరీతో పాటు ఇంటెన్స్ డ్రామా ఉంటుంది. ఊరిలో జరిగే కథ కనుక కులాల ప్రస్తావన ఉంటుంది. అయితే ఎవరినీ కించేపరిచే అంశాలు ఇందులో ఉండవు. సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు' అన్నారు. 'నేను నిర్మాతగా మీ ముందు నిలబడడానికి అల్లు అరవింద్, బన్నీ వాస్‌గార్లు కారణం. ఈ చిత్రకథ వినగానే బన్నీ వాసుగారు చాలా ఎగ్జైట్ అయ్యారు. సుహాస్ కూడా చాలా ఇన్వాల్వ్ అయ్యాడు. ఈ సినిమా కోసం రెండు సార్లు గుండు చేయించుకున్నాడు. హీరోయిన్ శివానీ, శరణ్య ప్రదీప్ తదితరులు అద్భుతంగా నటించారు. మా ఛాయాగ్రాహకుడు వాజిద్ అమలాపురం ప్రాంతాన్ని అద్భుతంగా తెరకు ఎక్కించారు. సంగీత దర్శకుడు శేఖర్ చంద్ర మంచి ట్యూన్స్ ఇచ్చారు. హిట్ అవుతుందనే నమ్మకం ఉంది' అన్నారు నిర్మాత ధీరజ్. చివరిగా హీరో సుహాస్ మాట్లాడుతూ 'నిన్ననే నాకు బాబు పుట్టాడు. ఆ హ్యాపీలో ఉన్నా. అలాగే ఈ సినిమా రిలీజ్ కోసం ఎదురు చూస్తున్నా. నా కెరీర్‌లో ఇది చాలా స్పెషల్ మూవీ. సినిమా చూస్తున్నప్పుడు మీ జీవితంలో జరిగిన సందర్భాలను గుర్తు చేసుకుంటారు' అన్నారు.



ఎన్‌డీఎఫ్‌కు రామ్ విరాళం

దేశభక్తి కథాంశంతో రూపొందిన 'రామ్' (ర్యాపిడ్ యాక్షన్ మిషన్) చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. మిహిరామ్ వైనతేయ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. సూర్య అయ్యలసోమయాజుల హీరోగా, ధన్య బాలకృష్ణ హీరోయిన్‌గా నటించారు. మంగళవారం సాయంత్రం జరిగిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన నిర్మాత వివేక్ కూచిభొట్ల మాట్లాడుతూ 'మంచి కంటెంట్‌తో వస్తున్న సినిమా ఇది. నేను కొంత రషెస్ చూశా. ఎన్నో ఇబ్బందులు పడి చిత్రాన్ని తీశారు. కంటెంట్ బాగుంటే చిన్న సినిమాలు కూడా పెద్ద విజయాలు సాధిస్తున్నాయి. అలాగే ఈ సినిమా కూడా విజయం సాధించాలని కోరుకుంటున్నా' అన్నారు. నిర్మాత బెక్కం వేణుగోపాల్ మాట్లాడుతూ 'దేశభక్తిని చాటి చెప్పే ఈ సినిమా ఈ నెల 26న విడుదలవుతోంది' అన్నారు. 'బోర్డర్‌లో ఉన్న సైనికుల గురించే కాకుండా టెర్రరిస్టుల నుంచి మనల్ని కాపాడే అన్‌సంగ్ హీరోల గురించి కూడా ఈ సినిమాలో చూపించాం. మాకు థియేటర్లు దొరకడం కష్టంగా ఉంది. అయినా మా పంపిణీదారుడు గణేశ్ మంచి థియేటర్ల కోసం ప్రయత్నిస్తున్నారు' అన్నారు దర్శకుడు మిహిరామ్. ఈ సినిమాకు తెగే ప్రతి టికెట్‌లో ఐదు రూపాయలను నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు ఇస్తామని నిర్మాత దీపికాంజలి చెప్పారు.

జాలీ రైడ్‌కు వెళ్లిన అనుభూతి కలుగుతుంది

శివ కార్తికేయన్



శివ కార్తికేయన్, రకుల్ ప్రీత్‌సింగ్ జంటగా రూపొందిన 'అయలాన్' చిత్రం ఈ నెల 12న సంక్రాంతి సందర్భంగా తమిళనాడులో విడుదలై విజయం సాధించింది. తెలుగు రాష్ట్రాల్లో ఈ నెల 26న గంగ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ద్వారా మహేశ్వర్ రెడ్డి విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా తెలుగు మీడియాతో బుధవారం కార్తికేయన్ ముచ్చటించారు

- దర్శకుడు రవికుమార్ విజన్ 'అయలాన్'. సినిమాలో 4500 వి.ఎఫ్.ఎక్స్ షాట్స్ ఉన్నాయి. పరిమిత నిర్మాణ వ్యయంతో సినిమా తీయగలిగితే మరింత పెద్ద కలలు కనవచ్చు.. అనిపించింది. అందుకే ఎక్కువ రోజులు పట్టినా ఈ సినిమానే చేయాలని నిర్ణయించుకున్నా.
- యూనివర్సల్ కాన్సెప్ట్ ఉన్న చిత్రమిది. హ్యూమన్, ఏలియన్ మధ్య ఇంటరాక్షన్ అన్ని ప్రాంతాల ప్రేక్షకులకు కనెక్ట్ అవుతుంది. ఇది సినిమాలా ఉండదు. థీమ్ పార్క్‌లోకి వెళ్లి జాలీ రైడ్ చేసిన అనుభూతి కలిగిస్తుంది. మా సినిమా తమిళనాడులో భారీ విజయం సాధించింది. తెలుగులో కూడా విజయం సాధిస్తుందన్న నమ్మకం ఉంది.
- రూ. 200, 300 కోట్ల బడ్జెట్ ఉంటే తప్ప ఇటువంటి సినిమా చేయలేమని చెబుతారు. అయితే సరైన టీమ్, ప్లానింగ్ ఉంటే తక్కువ బడ్జెట్‌లో కూడా తీయవచ్చు. ఇది హిట్ అయితే ఎక్కువ బడ్జెట్ ఇవ్వడానికి నిర్మాతలు ముందుకు వస్తారు. అయలాన్‌లో 90 శాతం గ్రాఫిక్స్ ఉన్నాయి. 70 శాతం సినిమాలో ఏలియన్ ఉంది.
- ఈ సినిమాకు సీక్వెల్ ఐడియా ఉంది. ఏలియన్‌ను క్రియేట్ చేయడానికి చాలా రిసెర్చ్ చేశాం. ఎక్కువ టైమ్ స్పెండ్ చేశాం. సీక్వెల్‌ను ఇంతకంటే బిగ్గర్ స్కేల్‌లో చేస్తాం.
- రాజ్‌కుమార్ పెరియస్వామి దర్శకత్వంలో కమల్‌హాసన్ సార్‌తో కలిసి నటిస్తున్నాను. 'ఎస్‌కే21' వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రం 80 శాతం పూర్తయింది. ఇందులో నేను, సాయిపల్లవి కలసి నటిస్తున్నాం. వేసవిలో విడుదల కావచ్చు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/ZiFDQlr లో చదవండి.

దిక్సూచి DIKSUCHI

అడ్వంచరస్ కెరీర్ ఫోరెన్సిక్ సైన్స్

సోనీ టెలివిజన్‌లో కొన్నేళ్లగా అలరిస్తున్న ధారావాహిక సీఐడీ. అందులో తప్పనిసరిగా ల్యాబ్ టెస్ట్ ఉంటుంది. వాస్తవానికి ఒక ఎపిసోడ్‌కు అవసరమైన క్లూ అక్కడే లభ్యమయ్యేది. నేరగాళ్లను పట్టుకోవడం ఒక ఎత్తు అయితే, దాన్ని సశాస్త్రీయంగా నిరూపించడంలో ప్రధాన పాత్ర వహించేది ల్యాబ్. నేరస్థలం వద్ద సేకరించిన వస్తువులను శాస్త్రీయంగా పరిశీలించడం, నిజాన్ని రాబట్టేందుకు అవసరమైన సాక్ష్యాన్ని ధ్రువీకరించడం అన్నవి రెండూ అక్కడ జరుగుతాయి. వస్తువుల సేకరణ నుంచి శాస్త్రీయంగా నేర ధ్రువీకరణ వరకు జరిగే వ్యవహారం అంతటినీ ఒక మాటలో చెప్పాలంటే ఫోరెన్సిక్ సైన్స్ అనవచ్చు.

➡ 'ఫోరమ్' అనేది లాటిన్ పదం. పది మంది ఒక చోట చేరి, చర్చించి ఒక నిర్ధారణ లేదా నిర్ణయానికి రావడంగా ఈ పదానికి అర్థం చెప్పుకోవచ్చు. దానికి శాస్త్రీయతను జోడించినప్పుడు అది ఫోరెన్సిక్ సైన్స్ అవుతుంది. లీగల్, సివిల్, క్రిమినల్, నియంత్రణ, చట్టబద్ధతకు సంబంధించిన విషయాలను నిర్ధారించేందుకు రెండు రకాల సాక్ష్యాలు ఉపకరిస్తాయి. అందులో మొదటిది వ్యక్తులు చెప్పేవి. చిన్న పిల్లలు అబద్ధం చెప్పరన్న నమ్మకంతో వారి సాక్ష్యానికి విలువ ఇస్తున్నారు. మహిళలు, వృద్ధుల చెప్పేదానికి ఒక మేర విలువ ఉంది. అయితే, ప్రలోభాలకు గురై మాటకు కట్టుబడకపోవడం, కోర్టుకు వచ్చేటప్పటికి వాంగ్మూలాన్ని మార్చేయడం అన్నది ఎప్పటి నుంచో ఈ సమాజంలో ఉంది. ఫలితంగా మానవుల సాక్ష్యం హేతుబద్ధతకు నిలవటం లేదు. రెండోది శాస్త్రం సహకారంతో పక్కాగా సాక్ష్యాన్ని ముందుంచడం. శాస్త్రీయ పరిజ్ఞానం, అవగాహన పెరిగిన దరిమిలా ఏదైనా విషయాన్ని సైంటిఫిక్‌గా రుజువు చేసే అవకాశం కలుగుతోంది. డీఎన్ఏ పరీక్ష, పాలిగ్రాఫ్, వాయిస్(మాట) అలాగే ఇమేజ్(చిత్రం) ఐడెంటిటీ తదితరాలు ఇందులోకి వస్తాయి. భౌతిక సాక్ష్యాలను పరిశీలించి నేర నిర్ధారణ జరుగుతుంది. ఇంటర్నెట్ వినియోగం పెరిగిన నేపథ్యంలో ఆ రకంగానూ నేరాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ పరిస్థితుల్లో నేర నిరూపణకు శాస్త్ర వినియోగం పెరిగింది. సాధ్యమైనంత వరకు శాస్త్రీయంగా నిరూపించడం ద్వారా వివిధ కేసులను సముచితంగా పరిష్కరించే వీలు న్యాయ వ్యవస్థకు లభిస్తోంది.

➡ క్రిమినల్ జస్టిస్ వ్యవస్థలో క్రిటికల్ ఎలిమెంట్ ఫోరెన్సిక్ సైన్స్. ఈ సైంటిస్టులు సాధారణంగా క్రైమ్ సీన్ నుంచి సేకరించిన ఎవిడెన్స్‌ను విశ్లేషిస్తారు. ఇన్వెస్టిగేషన్, తదుపరి ప్రాసిక్యూషన్‌కు అవసరమైన సహకారాన్ని అందిస్తారు. తద్వారా అసలు దోషులను పట్టిస్తారు. అమాయకులను బైటపడేస్తారు. అలా నేర నిర్ధారణలో ఫోరెన్సిక్ సైన్స్ ఈ రోజుల్లో కీలకపాత్ర పోషిస్తోంది.

➡ మెడిసిన్, ఇంజనీరింగ్ కాకుండా మరేదైనా మంచి కోర్సు చేయాలనుకుంటే ఫోరెన్సిక్ సైన్సెస్‌ను ఎంపిక చేసుకోవచ్చు. సాహసాలు చేయాలనుకునే యువత ఎంచుకోదగ్గ కోర్సు. అడుగడుగున థ్రిల్ కలిగిస్తుంది. ఎథికల్ హ్యాకింగ్‌తో మొదలుపెట్టి ఇంటెలిజెన్స్ సర్వీసులు అంటే ఇంటెలిజెన్స్ బ్యూరో, నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ, రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్, నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, సీఐడీ, సీబీఐ అది కాదంటే ప్రైవేటు డిటెక్టివ్‌గా పనిచేయాలంటే ఫోరెన్సిక్ సైన్స్ చదవడం అభిలషణీయం అవుతుంది. ఇక్కడ పేర్కొన్న వాటిలో కొన్నింటిలో కుదురుకునేందుకు యూపీఎస్సీ ఎగ్జామ్స్‌ను ఎదుర్కోవాలి. మరికొన్నింటికి వేరే మార్గాలు ఉన్నాయి.



➡ విశ్లేషణ అలాగే క్రైమ్ సంబంధిత డేటాను ఇంటర్‌ప్రెటేట్ చేసేందుకు కెమిస్ట్రీ, బయాలజీ, ఫిజిక్స్ సమాచారాన్ని ఉపయోగించాలి. మొత్తమ్మీద చట్టాన్ని అమలు చేసే సంస్థలకు ఉపయోగపడేలా ఉండాలి. ముఖ్యంగా ఇందులో నిలదొక్కుకావాలంటే బయాలజీ, కెమిస్ట్రీ, సైకాలజీపై పట్టు ఉండాలి.

కోర్సులు: ఎంబీబీఎస్ తదుపరి ఎండీ ఫోరెన్సిక్ సైన్స్ చేస్తే ఈ రంగంలో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చు. పెద్ద ఆసుపత్రుల్లో జరిగే శవపరీక్షల్లో పాల్గొనాల్సి ఉంటుంది. తద్వారా నేర నిరూపణకు శాస్త్రీయంగా సమాచారాన్ని ఇవ్వవచ్చు.

➡ ఎక్కువ మంది సులువైన మార్గం అంటే మూడేళ్ల బీఎస్సీ ఫోరెన్సిక్ సైన్స్ చదువుతారు. మరికొందరు ఆపై పీజీ కూడా చేస్తారు. దేశవ్యాప్తంగా పలు సంస్థలు ఈ కోర్సులను అందిస్తున్నాయి. డీఎన్ఏ ప్రొఫైలింగ్, ఫింగర్‌ప్రింట్ విశ్లేషణ, రక్తపు మరకల విశ్లేషణ, సలైవా అండ్ బోన్ అనాలిసిస్‌కు తోడు క్రిమినల్ జస్టిస్‌ను కూడా చదవాల్సి ఉంటుంది. పీజీలో చాలా స్పెషలైజేషన్స్ చేసే వీలు ఉంటుంది. ఫోరెన్సిక్ సైన్సెస్ నుంచి క్రిమినల్ సైన్స్ వరకు స్పెషలైజేషన్స్ చేసే వీలు ఉంటుంది. బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీతో ఇంటర్ ఉత్తీర్ణులు ఈ కోర్సులు చేయవచ్చు.

➡ లీగల్ వ్యవహారాలపై ఆసక్తి ఉన్న వ్యక్తులు పీజీ డిప్లొమా ఇన్ సైబర్‌లా, ఎల్ఎల్ఎం ఇన్ క్రిమినల్ లా అండ్ క్రిమినల్ జస్టిస్ సిస్టమ్ చదవాలి. నేషనల్ లా స్కూల్స్ ఈ కోర్సులను అందిస్తున్నాయి. నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీ కూడా వివిధ కోర్సులను అందిస్తోంది. ఫోరెన్సిక్ జస్టిస్ అండ్ పాలసీ స్టడీస్, పీజీ డిప్లొమా ఇన్ హ్యూమనటేరియన్ ఫోరెన్సిక్స్‌ని ఆఫర్ చేస్తోంది.

ఉద్యోగం: స్టేట్ ఫోరెన్సిక్ లేబరేటరీలు, కేంద్ర ప్రభుత్వ విభాగాలు అంటే సీబీఐ తదితరాలు, మెడికల్ కాలేజీల్లో వీరికి ఉపాధి లభిస్తుంది. కొన్ని పరిమితులతో ప్రైవేటు దర్యాప్తుల్లో పాల్గొనవచ్చు. కొంత అనుభవం గడించిన తరవాత ప్రైవేటు ప్రాక్టీస్ చేసుకోవచ్చు. ఐటీలో మాదిరిగా ఆరంభంలోనే కళ్లు చెదిరే ప్యాకేజీలు ఇందులో ఉండవు. స్కోప్ ఎంత ఉన్నప్పటికీ సంబంధిత టెక్నిక్స్, ఇంప్లిమెంటేషన్ అలవడ్డాకే మంచి మొత్తాలను అందుకునే అవకాశం లభిస్తుందనే విషయాన్ని ఇటు వైపు వచ్చే యువత గుర్తుంచుకోవాలి.

ఈ కోర్సులను అందిస్తున్న కొన్ని సంస్థలు

- గుజరాత్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ, గాంధీనగర్
- లోక్‌నాయక్ జేపీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫోరెన్సిక్ సైన్స్, న్యూఢిల్లీ
- ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫోరెన్సిక్ సైన్స్, ముంబై
- ఐఎఫ్ఎస్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్, పుణె
- ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్
- డాక్టర్ హరిసింగ్ గౌర్ విశ్వవిద్యాలయ్, సాగర్
- బుందేల్‌ఖండ్ యూనివర్సిటీ, ఝాన్సీ
- ఎమిటీ యూనివర్సిటీ
- యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్
- డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్ యూనివర్సిటీ, ఆగ్రా
- లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ, పంజాబ్

ఎన్‌ఏడీపీలో పీజీడీఎం

నాగ్‌పూర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ డిఫెన్స్ ప్రొడక్షన్(ఎన్ఏడీపీ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(పీజీడీఎం)(బిజినెస్ మేనేజ్‌మెంట్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది రెండేళ్ల వ్యవధి గల రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. ఏడాదికి రెండు చొప్పున మొత్తం నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. దీనికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది. ఈ ప్రోగ్రామ్ డిఫెన్స్ ఇండస్ట్రీస్‌కు సంబంధించి ఉంటుంది. ఇందులో ప్రధానంగా డిఫెన్స్ మేనేజ్‌మెంట్ అంశాలు బోధిస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా థియరీ, ప్రాక్టికల్ తరగతులు; ఇండస్ట్రియల్ విజిట్‌లు, సెమినార్‌లు, కేస్ స్టడీస్, డిజర్టేషన్/ప్రాజెక్ట్ వర్క్‌లు, ఇంటర్న్‌షిప్‌లు ఉంటాయి. డిఫెన్స్ ప్రొడక్షన్ విభాగాల్లో ఆసక్తి ఉన్నవారు, భారత సాయుధ దళాల్లో పనిచేస్తున్న ఆఫీసర్లు, కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్నవారు, పీఎస్‌యూల ఉద్యోగులు దరఖాస్తు చేసుకోవచ్చు. క్యాట్ వ్యాలిడ్ స్కోర్, అకడమిక్ మెరిట్, అనుభవం, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్, గ్రూప్ డిస్కషన్/పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేసి అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. వయోపరిమితి నిబంధనలు లేవు. స్పాన్సర్డ్ అభ్యర్థులకు కనీసం అయిదేళ్ల అనుభవం ఉండాలి. క్యాట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి.

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.7,00,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 17
- **వెబ్‌సైట్:** www.ddpdoo.gov.in/units/nadp

నీలిట్‌లో ఇంటర్న్‌షిప్

హరిద్వార్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(నీలిట్)- ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది ఆర్నెల్ల వ్యవధి గల లెవెల్ 1-వర్క్ బేస్డ్ లెర్నింగ్ ప్రోగ్రామ్. హరిద్వార్‌లో 6, డెహ్రాడూన్‌లో 4 సీట్లు ఉన్నాయి. మహిళలు, ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ కేటగిరీల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.10,000ల స్టయిపెండ్ ఇస్తారు. హరిద్వార్ నీలిట్‌కు చెందిన సైంటిస్టులు, నిపుణులు మెంటార్లుగా వ్యవహరిస్తారు.

ఇంటర్న్‌షిప్ అంశాలు: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్, క్వాంటం కంప్యూటింగ్, అగ్‌మెంటెడ్ రియాలిటీ అండ్ వర్చువల్ రియాలిటీ, బ్లాక్ చెయిన్, వైర్‌లెస్ నెట్‌వర్క్స్, స్మార్ట్ మొబిలిటీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, సైబర్ సెక్యూరిటీ అండ్ సైబర్ ఫోరెన్సిక్స్, బిగ్ డేటా అనలిటిక్స్, డిజిటల్ ప్రిజర్వేషన్, క్లౌడ్ కంప్యూటింగ్, 3డీ ప్రింటింగ్, ఫ్లెక్సిబుల్ ఎలక్ట్రానిక్స్, ఎమర్జింగ్ మెమరీ/స్టోరేజ్ టెక్నాలజీస్, మెషిన్ విజన్, సీపీయూ డిజైన్.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి బీఈ/బీటెక్(కంప్యూటర్ సైన్స్/ఎలక్ట్రానిక్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్) పూర్తిచేసిన వారు లేదా ప్రస్తుతం ఏడు/ఎనిమిది సెమిస్టర్లు చదువుతున్నవారు అప్లయ్ చేసుకోవచ్చు. ఎమ్మెస్సీ(ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/కంప్యూటర్ సైన్స్/ఎలక్ట్రానిక్స్)/ఎంసీఏ ఉత్తీర్ణులు కూడా అర్హులే.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 31
- **వెబ్‌సైట్:** nielit.gov.in

ఐఐఎం కాశీపూర్‌లో పీహెచ్‌డీ

కాశీపూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. జాతీయ పరీక్ష స్కోర్ లేదా బెంగళూరు ఐఐఎం నిర్వహించే ఐఐఎంబీ టెస్ట్ స్కోర్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రోగ్రామ్‌కి 28 క్రెడిట్స్ నిర్దేశించారు.

స్పెషలైజేషన్‌లు: బిజినెస్ కమ్యూనికేషన్, ఎకనామిక్స్, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ సిస్టమ్స్, మార్కెటింగ్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ అండ్ డెసిషన్ సైన్సెస్, ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, పబ్లిక్ పాలసీ, స్ట్రాటజీ.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో ఏదేని మాస్టర్స్ డిగ్రీ/ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ డిగ్రీ/సీఏ/సీఎంఏ/సీఎస్ ఉత్తీర్ణులు; బీఈ/బీటెక్/బీఆర్క్ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. జీమ్యాట్/జీఆర్ఈ/క్యాట్/గేట్ వ్యాలిడ్ స్కోర్ లేదా జేఆర్ఎఫ్ నెట్ అర్హత తప్పనిసరి. లేదంటే ఐఐఎంబీ టెస్ట్‌లో అర్హత సాధించాల్సి ఉంటుంది.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 29
- **వెబ్‌సైట్:** iimkashipur.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/t8cTxZkలో చదవండి.


యరపతినేని, టీఎన్‌టీయూసీ నేతలను సత్కరిస్తున్న కార్మిక సంఘ నేతలు

టీడీపీతోనే కార్మికవర్గానికి ఉజ్వల భవిష్యత్తు

● మాజీ ఎమ్మెల్యే యరపతినేని ● కార్మిక చైతన్య బస్సు యాత్రకు ఘన స్వాగతం

పిడుగురాళ్ల, జనవరి 24: టీడీపీతోనే కార్మికులకు ఉజ్వల భవిష్యత్ సాధ్యమని, వైసీపీ ఇసుక పాలసీతో రాష్ట్రంలో లక్షలాది మంది కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందని, కొవిడ్ సమయంలో ఏ ఒక్క కార్మిక కుటుంబాన్నీ వైసీపీ ప్రభుత్వం ఆదుకోలేదని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. కార్మికచైతన్య బస్సుయాత్ర బుధవారం పిడుగురాళ్ల పట్టణానికి చేరకోగా అక్కడి షాదీఖానాలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యరపతినేని మాట్లాడుతూ రాష్ట్రంలో 12 లక్షలకు పైగావున్న కార్మికులకు ఎలాంటి ప్రయోజనాలు, పథకాలు అందటం లేదన్నారు. పిడుగురాళ్లలో టీఎన్‌టీయూసీ కార్యాలయానికి 10 సెంట్లు స్థలాన్ని కేటాయించడంతో పాటు నిర్మాణానికి కావలసిన ఆర్థిక సహాయాన్ని కూడా అందజేస్తానని యరపతినేని తెలిపారు. అదేవిధంగా కార్మికులకు చంద్రన్న బీమా ద్వారా రూ.5 లక్షల నుంచి 10 లక్షల వరకు ప్రయోజనం పొందేలా చేస్తామన్నారు. నియోజకవర్గంలో వున్న కార్మికుల కుటుంబాలకు బీమా సొమ్మును తానే సొంతంగా చెల్లిస్తానని యరపతినేని తెలిపారు. ఆటోనగర్ ఏర్పాటుతో పాటు సొంత ఇల్లు మంజూరు చేయిస్తానని భరోసా ఇచ్చారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రఘురామరాజు మాట్లాడుతూ టెక్కలి నుంచి కుప్పంవరకు కార్మిక చైతన్య బస్సుయాత్ర సాగుతుందన్నారు. సమావేశంలో లెనిన్‌బాబు, రెంటపాళ్ల శ్యామ్, చంద్రశేఖర్, బాషా, మందా దుర్గారావు, యడవల్లి కొండలు, పాండురంగ శ్రీను, సర్వేశ్వరరావు, కామిశెట్టి రమేష్, వడ్డవల్లి సాంబశివరావు, దూదేకుల ఖాసిం, సయ్యద్ అమీర్‌అలి, వీరాస్వామి, కనిగిరి శ్రీను, తంగెళ్ల శ్రీనివాసరావు, తదితర నేతలు పాల్గొన్నారు.

టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కమిటీలో పలువురికి స్థానం

గుంటూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కమిటీలో ఉమ్మడి గుంటూరుజిల్లాలోని పలువురు నేతలకు స్థానం దక్కింది. గుంటూరు తూర్పు నుంచి గుడిమెట్ల దయారత్నం, వేమూరు నుంచి బోరుగడ్డ వెంకటరావు, రేపల్లె నుంచి దున్నా సంగీతరావు, సత్తెనపల్లి నుంచి పంచల నాగేశ్వరరావు, పల్లె యప్రాయిమ్, శనగపూల నరసింహారావు, మంగళగిరి నుంచి బొంతల హరిదాసు, ఈపూరి ఇస్మాయిల్(పెద్దబ్బాయి), బొక్క నాగరాజు, ప్రత్తిపాడు నుంచి లింగంగుంట్ల ఆదాంలకు రాష్ట్ర కమిటీలో స్థానం దక్కింది.

బీసీ సెల్ రాష్ట్ర కమిటీలో సత్తెనపల్లికి చెందిన బాతుల వెంకట స్వామి, బాతుల అప్పారావు,తెనాలి నుంచి ఉప్పలపాటి మారుతి వెంకట లింగం, పెదకూరపాడు నుంచి నండూరి వెంకటస్వామి రాజులకు స్థానం దక్కింది.

వీరయ్యచౌదరి ఆశయాలకు వారసులం


చింతలపూడిలో ఎన్టీఆర్, వీరయ్య చౌదరికి నివాళులు అర్పిస్తున్న నరేంద్ర కుమార్, రామాంజనేయులు తదితరులు

● మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్
● పొన్నూరులో డీవీసీ వర్ధంతి కార్యక్రమాలు

పొన్నూరుటౌన్, జనవరి24: ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి వదిలి వెళ్లిన అశేష ప్రజాభిమానానికి, ఆశయాలకు వారసులుగా పనిచేస్తున్నామని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. బుధవారం పొన్నూరు, చేబ్రోలు మండలాలో మాజీ మంత్రి ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి 30వ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. చింతలపూడి గ్రామంలోని స్మృతి వనం వద్ద ఆయన సతీమణి ధూళిపాళ్ళ ప్రమీలదేవి, కుమారుడు నరేంద్ర కుమార్, జ్యోతిర్మయి దంపతులు వీరయ్య చౌదరికి నివాళులు అర్పించారు. గ్రామంలోని ధూళిపాళ్ళ వీర్యచౌదరి, ఎన్టీఆర్ విగ్రహాలకు, నరేంద్ర కుమార్, ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి బి.రామాంజనేయులు ఘన నివాళ్లు అర్పించారు. అనంతరం నిడుబ్రోలు, పొన్నూరు పట్టణ, నారాకోడూరు, చేబ్రోలు, పశుదాణా కర్మాగారం, డీవీసీ హాస్పటల్, సంగం డెయిరీలో వీరయ్య చౌదరి వర్ధంతి వేడుకలు జరిగాయి. టీడీపీ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో నరేంద్ర కుమార్ మాట్లాడుతూ దేశంలో క్షీర విప్లవ సారధి ధూళిపాళ్ళ వీరయ్య చౌదరేనన్నారు. సంగం డెయిరీ బలోపేతానికి కృషి చేశారన్నారు. త్వరలోనే తెలంగాణలోని మిర్యాలగూడలో నూతన ప్లాంట్‌ను ఆరంభిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీవీసీ హాస్పటల్ ఎండీ ధూళిపాళ్ళ జ్యోతిర్మయి, సంగం డెయిరీ ఎండీ పి.గోపాళ్ల కృష్ణ, పాలకవర్గ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమరావతి రైతుల త్యాగం ఎనలేనిది

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట అర్బన్, జనవరి 24: ఆంధ్రుల ఆశల సౌధం, ప్రజా రాజధాని అమరావతి ఉసురు జగన్‌కు తగలక పోదని, మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. బుధవారం చిలకలూరి పేటలోని నివాసంలో ప్రత్తిపాటి విలేకరులతో మాట్లాడుతూ అమరావతి ఉద్యమం 1500 రోజులకు చేరిన సందర్భంగా వారికి సంఘీభావం ప్రకటిస్తూ మరికొన్ని రోజుల్లో రాష్ట్రానికి పట్టిన జగన్ శని వదిలిపోవటంతో పాటు అమరావతికి మంచిరోజులు రానున్నాయన్నారు. రాష్ట్రం కోసం, రేపటి తరం భవిష్యత్ కోసం చంద్రబాబు ఒక్క పిలుపుతో 33వేల ఎకరాల బంగారు భూములను రాజధానికి ఇచ్చిన రైతుల త్యాగాలను స్వార్ధ రాజకీయాలకు జగన్ బలిపెట్టారన్నారు. అమరావతిపై టీడీపీ-జనసేన కూటమి విధానం ఇప్పటికే స్పష్టంగా ప్రకటించామని, తమ ఉమ్మడి ప్రభుత్వం రాగానే అమరావతిని అద్భుతంగా తీర్చిదిద్దుతామని హామీఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో వైసీపీకి ఒక్క సీటు కూడా రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రజలు, టీడీపీ-జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ఈ విషయం ముందే గ్రహించి అధికార పార్టీ వైసీపీ తరుపున పోటీ చేయటానికి కూడా ఎవ్వరూ సాహసం చేయటం లేదన్నారు.

గుంటూరు సర్కిల్ ఎస్ఏవోగా రామిరెడ్డి

గుంటూరు, జనవరి 24: ఏపీ సీపీడీసీఎల్ గుంటూరు సర్కిల్ సీనియర్ అకౌంట్స్‌ఆఫీసర్ (ఎస్ఏవో)గా పాశం రామిరెడ్డి మరోసారి నియమితులయ్యారు. ప్రస్తుతం ఎస్ఏవోగా వ్యవహ రిస్తున్న .సుబ్బారావు ఒంగోలు సర్కిల్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ మేరకు సీపీడీసీఎల్ ఇన్‌చార్జ్ సీఎండీ సంతోషరావు ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో రామిరెడ్డి గుంటూరు సర్కిల్ ఎస్ఏవోగా పనిచేస్తుండగా గుణదలలోని ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఎస్ఏవోగా బదిలీపై వెళ్లారు. తాజాగా మళ్లీ మాతృస్థానం గుంటూరుకు బదిలీపై వచ్చారు. బదిలీ ఉత్తర్వులు వెలువడిన వెంటనే సుబ్బారావు రిలీవ్ అయ్యారు.


కొలిమి కార్మికునితో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

వైసీపీ పాలనలో ప్రజలపై మోయలేని భారం

● మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

కొల్లిపర,జనవరి 24: రాష్ట్రంలో పేద ప్రజలపై మోయలేని బారాన్ని సీఎం జగన్మోహన్‌రెడ్డి మోపుతున్నారని మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. ప్రజాయాత్రలో భాగంగా బుధవారం మండలంలోని దావులూరిపాలెం, కొత్తబొమ్మువానిపాలెం, కొల్లిపర శ్రీవీరభద్రస్వామి కాలనీల్లో స్థానిక టీడీపీ నాయకులతో కలిసి పర్యటించారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంటికి పన్ను, ఇంటిలో ఊడ్చిన చెత్తకు పన్ను, మంచినీటికి పన్ను, విద్యుత్ ఛార్జీలు పెంపు ఇలా రకరకాల పన్నులు పెంచి పేదలపై పెనుభారం మోపినట్లు తెలిపారు. వైసీపీ పరిపాలనలో ఏ ఒక్కరూ సంతోషంగాలేరన్నారు. పేద ప్రజలకు ఇండ్ల స్థలాలు ఇచ్చారేగాని గృహాలు నిర్మించుకోవాలంటే అనేక అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. కొలిమి కార్మికులతో మాట్లాడుతూ వారి సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, రాష్ట్ర తెలుగురైతు కార్యనిర్వహక కార్యదర్శి వంగా సాంబిరెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి కంచర్ల అమృతరాజు, టీడీపీ నాయకులు ఆళ్ళ వీరారెడ్డి, గుదిబండి గోవర్ధనరెడ్డి, ఆరిమండ రాధాకృష్ణారెడ్డి, ఆరే శేఖర్, ఆరిమండ వెంకటరెడ్డి, బొల్లు యోగానంద చటర్జీ, దాసరి నరసయ్య, కొల్లి కోటిరెడ్డి, బొంతు చంద్రిక, ఉప్పాల రమేష్‌రెడ్డి, తాతా అంజనేయులు, షేక్ రఫీ, పాల్గొన్నారు.

జగన్‌కు ఎవ్వరూ ఓటు వేయరు

● టీడీపీ సత్తెనపల్లి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, జనవరి 24: గత ఎన్నికల్లో ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఈ సారి ఓటర్లు ఎవ్వరూ ఓటు వేయరని టీడీపీ సత్తెనపల్లి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు సంవత్సరాల నుంచి విదేశీ విద్య పథకాన్ని సక్రమంగా అమలు చేయక పోవటం వల్ల ఎంతోమంది నిరుద్యోగ యువత తమ భవిష్యత్‌లను కోల్పోయారన్నారు. అంబే ద్కర్ విదేశీ విద్య పథకాన్ని జగనన్న విదేశీ విద్యా పథకంగా మార్చి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు తీవ్ర అవమానం చేశారని అన్నారు. విదేశాలకు వెళ్ళి ఉన్నత చదువులు చదుకొని మంచి ఉద్యోగాలు చేయాలనుకున్న యువత కలలను ఈ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు ఎవ్వరూ కూడా జగన్‌కు ఓటు వేయరని తేలి పోయిందన్నారు.

ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి

గుంటూరు, జనవరి 24 : గుంటూరు నల్లపాడు స్టేషన్ పరిధిలోని ఇన్నర్ రింగ్‌రోడ్డులో ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ ఇరగదల బ్రహ్మం (35) మృతి చెందాడు. బుధవారం సాయంత్రం నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇన్నర్ రింగ్‌రోడ్డు నుంచి ఆటోనగర్ వెళ్ళరోడ్డులో సోనోవిజన్ షోరూం సమీపంలో ఈ దుర్ఘటన జరిగింది. ఆటోనగర్ వైపు నుంచి చిల్లీస్ వైపు వస్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడగా ట్రాక్టర్ నడుపుతున్న పేరేచర్లకు చెందిన ఇరగదల బ్రహ్మం అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తమ్ముడు తిరుపతయ్య ఫిర్యాదు మేరకు నల్లపాడు ఎస్ఐ జేత్యా నాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బ్రహ్మం పేరేచర్లలో ట్రాక్టర్ నడుపుకుని జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.


1,13,746 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,16,066 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,13,746 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంకా యార్డు ఆవరణలో 64,339 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు తెలిపారు. వివిధ రకాల మిరప కాయలకు ధరలు ఈ విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8500	20000
నెంబరు. 5	9000	18500
273	9000	18000
341	9000	19000
4884	12500	19500
సూపర్ 10	14300	18000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	20500
బ్యాడిగి	9500	20000
దేవనూరు డీలక్స్	10000	20000
తెల్లకాయలు	5000	13000

ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనది

● కలెక్టర్ లోతేటి శివశంకర్



కొండవీడుకోటలోని బురుజుపై ఓటరు దినోత్సవ అవగాహన బ్యానర్‌ను ప్రదర్శిస్తున్న కలెక్టర్ శివశంకర్ తదితరులు

కొండవీడుకోట (యడ్లపాడు), జనవరి26: ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని, రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్క ఓటరు తప్పని సరిగా తమఓటుహక్కును వినియోగించుకోవాలని పల్నాడుజిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ కోరారు. మండలంలోని కొండవీడుకోటలో బుధవారం ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా గుంటూరుకు చెందిన ట్రెక్కింగ్ బృందం సభ్యులతో కలసి అధికారులంతా సమీపంలోని కొండపై ఉన్న బురుజుపైకి ట్రెక్కింగ్ నిర్వహించి ఓటరు దినోత్సవ బ్యానర్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఓటు హక్కు వినియోగించుకునే వారు 85 శాతం ఉండగా, పట్టణాల్లో అది 5 నుంచి 10శాతం తక్కువగా ఉంటున్నదన్నారు. ఓటు హక్కు నమోదు, వినియోగంపై యువతలో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. 18 ఏళ్ళు నిండిన వారంతా ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అటవీశాఖాధికారి రామచంద్రరావు, కొండవీడుకోట అభివృద్ధి కమిటీ కన్వీనర్ కల్లి శివారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదులో అలసత్వం.. వీఆర్వోపై చర్యలు

చేబ్రోలు, జనవరి24: చేబ్రోలు మండలం, శేకూరు గ్రామంలో ఎన్నికలు విధులు, శాఖాపరమైన అలసత్వం వహించిన బీఆర్వో మద్దు బాబుపై చర్యలు తీసుకొన్ని కలెక్టర్‌కు అటాచ్ చేసినట్లు తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ బుధవారం తెలిపారు. శేకూరు గ్రామంలో 76వ పోలింగ్ బూత్‌లో ఆరు కొత్త ఓట్ల నమోదులో ఒకే తండ్రి పేరు నమోదు చేసిన అంశంపై విచారణ నిర్వహించిన నివేదిక ఇచ్చినట్లు చెప్పారు. ఈ తప్పును సరిదిద్ది ఫిబ్రవరి నెలలో విడుదల చేసే అనుబంధ ఓటరు జాబితాలో ప్రచురించనున్నట్లు చెప్పారు. అలాగే 124వ బూత్‌లో మృతుల ఓట్లను జాబితాలో తొలగించినట్లు తెలిపారు.

రాష్ట్రానికి ద్రోహం చేసిన సీఎం జగన్‌రెడ్డి

● మూడు రాజధానుల ప్రకటనతో కనుమరుగైన అభివృద్ధి
● 1499వ రోజుకు చేరుకున్న ఆందోళనలు


వెంకటపాలెం ధర్నాశిబిరంలో నినాదాలుచేస్తున్న మహిళలు

తుళ్లూరు జనవరి24: రాజధాని అమరావతి నిర్మాణాన్ని విస్మరించి రాష్ట్రానికి, ఐదు కోట్ల మంది ప్రజలకు సీఎం జగన్‌రెడ్డి ద్రోహం చేశారని రాజధానికి 33 వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు ఆరోపించారు. బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతుకూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు బుధవారం నాటికి 1499వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ధర్నా శిబిరాల నుంచి పలువురు రైతులు మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని ఎక్కడా.. అనే మీమాంసలో ఉండి పెట్టుబడిదారులు కంపెనీలు పెట్టేందుకు ముందుకు రావటం లేదన్నారు. అదే అమరావతి రాష్ట్ర ఏకైక రాజధానిగా అభివృద్ధి కొనసాగుతుంటే, ప్రతి కంపెనీ రాష్ట్రం వైపు చూసేద న్నారు. లక్షల కోట్ల రాష్ట్ర సంపదను సీఎం జగన్‌రెడ్డి మూడు ముక్కల ఆటతో ఆవిరి చేస్తున్నాడని ఆవేదన వ్యక్తంచేశారు. హైకోర్టు చెప్పినా వినిపించుకోకుండా జగన్‌రెడ్డి మొండివైఖరి ప్రదర్శించటం సరికాదన్నారు. ఎప్పటికైనా అమరావతే రాష్ట్ర ఏకైక రాజధాని అని స్పష్టం చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం, రాజధాని 29 గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119, 130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

కర్పూరి ఠాకూర్‌కు భారతరత్న ఇవ్వడం గర్వకారణం : గుంటుపల్లి

దాచేపల్లి, జనవరి 24 : భారత స్వాతంత్ర్య సమరయోధుడు, భారతదేశంలో మొట్టమొదటి నాయీబ్రాహ్మణ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్‌కు భారతరత్న అవార్డును ప్రకటించడం బడుగు, బలహీనవర్గాలకు గర్వకారణమని జాతీయ నాయీబ్రాహ్మణ కవితా సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు, టీడీపీ జాతీయ క్రమ శిక్షణా కమిటీ సభ్యులు గుంటుపల్లి నాగేశ్వరరావు అన్నారు. దాచేపల్లిలోని ఆయన నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో వెనుకబడిన వర్గాల వారికి విద్య, ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్ కల్పించిన మార్గదర్శకుడు కర్పూరి ఠాకూర్ అని అన్నారు.

● సత్తెనపల్లి, జనవరి 24 : కర్పూరి సేవలు మరువలేనివని బీసీ సంఘాల నేతలు అన్నారు. మాజీ సీఎం కర్పూరి ఠాకూర్ వందవ జయంతిని బుధవారం బీసీ సంఘ నాయకులు పత్తిపాటి హరేకృష్ణ ఆధ్వర్యంలో బీసీ సంఘ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన శత జయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వం కర్పూరి ఠాకూర్‌కు భారతరత్న ప్రకటించటం గొప్ప విషయం అన్నారు. సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడారన్నారు. ఈ కార్యక్రమంలో కొమ్మూరి ప్రసాదు, చిరంజీవి, శ్రీనివాస్, దస్తగిరి, అంకమరావు, ప్రకాశరావు, షరీఫ్, నాగేశ్వరరావు, శివ, సతీష్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠినచర్యలు

మాచవరం, జనవరి 24 : గోవిందాపురం కృష్ణానదిపై నిర్వహిస్తున్న బల్లకట్టు ద్వారా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని గురజాల డీఎస్పీ పళ్లంరాజు హెచ్చరించారు. బల్లకట్టు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును బుధవారం ఆయన తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు, సలహాలు చేశారు. తెలంగాణ నుంచి బల్లకట్టు ద్వారా అక్రమ మద్యం, నగదు, అదేవిధంగా నాటు పడవలు ద్వారా కూడా అక్రమమద్యం, నగదు తరలిస్తే కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆయన వెంట ఎస్ఐ సమీర్‌బాషా, హెచ్‌సి అశోక్ తదితరులున్నారు.

కానుకమాత తిరునాళ్ల మహోత్సవం ప్రారంభం


దివ్యపూజ బలిని నిర్వహిస్తున్న ఫాదర్లు

రెంటచింతల, జనవరి 24 : రెంటచింతలలోని కానుకమాత 174వ తిరునాళ్ల మహోత్సవం బుధవారం జెండా ప్రతిష్ఠతో నేత్రపర్వంగా ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజుల పాటు వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా స్థానిక విచారణ గురువులు వైఎల్ మర్రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ఫాదర్ నరిశెట్టి అంతోని బాల మాట్లాడుతూ మరియతల్లి చిన్నారి బాల ఏసును కానుకగా ఇవ్వడం వలన కానుకమాత అనే పేరు సార్థకమైందని గుర్తు చేశారు. దివ్యపూజబలితో పాటు ప్రారంభసూచికగా పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. ఫిబ్రవరి 2న తిరునాళ్ల జరపనున్నారు. ఈ కార్యక్రమంలో విచారణా గురువులు పీటర్ పాపయ్య, ఎలీషారాజ్, సహాయ విచారణా గురువులు ఆగస్టీన్,కన్యాస్త్రీలు,సంఘ పెద్దలు,వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కమిటీలో సత్తెనపల్లికి స్థానం

సత్తెనపల్లి, జనవరి 24 : టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సత్తెనపల్లి నియోజకవర్గానికి చెందిన ముగ్గురు నాయకులను టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు దేశాల మేరకు నియమిస్తున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కే.అచ్చెన్నాయుడు బుధవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొ న్నారు. సత్తెనపల్లి నియోజకవర్గ పరిధిలోని రాజుపాలెం మండలం నెమలిపురికి చెందిన శనగపూల నరసింహారావును టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, ముప్పాళ్ళ మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు పచ్చల నాగేశ్వరరావును టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధిగా, పట్టణానికి చెందిన పల్లె ఇర్మియాను టీడీ పీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రాజు

పిడుగురాళ్ల, జనవరి 24 : టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పిడుగురాళ్ల మండలం జానపాడు గ్రామానికి చెందిన మక్కెన రాజు ఎంపిక య్యారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు విడుదల చేసిన జాబితాలో రాజుకు స్థానం దక్కింది. తన నియామకానికి కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకు రాజు కృతజ్ఞతలు తెలిపారు.

25 నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేత

పిడుగురాళ్ల, జనవరి 24: ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా అందిస్తున్న ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్ వైద్య సేవలను ఈ నెల 25వ తేదీ నుంచి నిలిపివేస్తున్నట్లు పిడుగురాళ్లలోని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యం బుధవారం తెలిపింది. గత జూన్ నెల నుంచి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు బిల్లుల చెల్లింపులు జాప్యం కారణంగా ఆసుపత్రుల యాజమాన్యం తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందన్నారు. ఆరోగ్యశ్రీ పథకం అమలులోని సమస్యలు పరిష్కారం కాకపోవడం వలన ఆరోగ్యశ్రీ పరిధిలోని వైద్యసేవలు నిలిపివేసేందుకు పల్నాడులోని నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యం నిర్ణయించింది.

మహిళలకు ఆసరా ఎంతో ఉపయోగం : ఎమ్మెల్యే కాసు

పిడుగురాళ్ల, జనవరి 24 : పొదుపు సంఘం మహిళలకు ఆసరా పథకం ఎంతో ఉపయోగకరంగా, ఆర్థికంగా చేయూతగా వుంటుందని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణ పరిధిలోని పలు సచివాలయాల్లో ఆసరా నాల్గవ విడత చెక్కులను పంపిణీ చేశారు. రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడిగా ఎన్నికైన కుందుర్తి గురవాచారిని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, ఎండీ గఫార్, కొమ్ము ముక్కంటి, చింతా వెంకట రామారావు తదితరులు పాల్గొన్నారు.

పరిటాల రవికి ఘన నివాళి

కారంపూడి, జనవరి 24: మండలంలోని పేటసన్నిగండ్లలో బుధవారం పరిటాల రవి వర్ధంతిని టీడీపీ నేతలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రవి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రవి రాష్ట్రానికి చేసిన సేవలను నేతలు కొనియాడారు. టీడీపీ అధికార ప్రతినిధి గోళ్ల సురేష్‌యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు పంగులూరి అంజయ్య, మండల అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ, చప్పిడి రాము, మాజీ ఉప ఎంపీపీ చావా వీరాంజనేయులు, మక్కెన సింహాచలం, దొడ్డా వెంకటనారాయణ, నీలమ, రషీద్ పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

గురజాలటౌన్, జనవరి 24: తెలంగాణ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఈబీ సీఐ వెంకటరమణ అన్నారు. ఆమె ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టారు. బుధవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలోని పల్లెగుంతలో పేరుపోగు మల్లయ్య వద్ద 10, పట్టణంలోని బస్టాండ్ సెంటర్ వద్ద మాదిరాజు సురేష్ వద్ద 29 తెలంగాణ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నాటుసారా, తెలంగాణ మద్యం, గంజాయి విక్రయాలు జరిపితే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. వీటిని ఎవరైనా విక్రయిస్తుంటే సెల్: 8555966363 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు. అనంతరం సీఐ వెంకటరమణతోపాటు ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన రవికుమార్‌లను సిబ్బంది అభినందించారు.

20 క్వింటాళ్ల ఎండు మిర్చి దగ్ధం

గురజాలటౌన్, జనవరి 24 : మండలంలోని పల్లెగుంతలో మిర్చి కల్లాల్లో కుప్పబోసిన 20 క్వింటాళ్ల ఎండు మిర్చిని గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి తగులబెట్టారు. గ్రామానికి చెందిన ఢీకొండ రమణ అనే రైతు మూడెకరాల పొలంలో పండిన మిర్చిని కల్లంలో ఆరబోయగా దహనం చేశారు. దగ్ధమైన మిర్చి విలువ రూ.4 లక్షలు ఉంటుందని రమణ వాపోయారు. గురజాల పోలీసులు సంఘటనా ప్రదేశానికి చేరుకొని పరిశీలించారు.

రాజధాని ఉద్యమంలో పాల్గొనాలి

సత్తెనపల్లి, జనవరి 24 : అమరావతి రాజధాని ఉద్యమం చేపట్టి ఈనెల 25వ తేదీ నాటికి 1500 రోజులు పూర్తయిన సందర్భంగా వెలగపూడి, మందడం శిబిరాల్లో జరగనున్న ప్రత్యేక కార్యక్రమాల్లో సత్తెనపల్లి ప్రాంతంలోని అమరావతి పరిరక్షణ సమితి జేఏసీ నాయకులంతా పాల్గొని జయప్రదం చేయాలని పరిరక్షణ సమితి నాయకులు నరిచేటి వేణుగోపాల్, మన్నవ శారద, జీ.శ్రీనివాసరావు బుధవారం కోరారు. సత్తెనపల్లి ప్రాంతంలోని రైతులు, మహిళలు, రైతు కూలీలు, అమరావతి రాజధాని సాధన ఉద్యమ కారులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఆయా శిబిరాల్లో జరిగే కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

టీడీపీలో బీసీలకు సముచిత స్థానం

● మాజీ ఎమ్మెల్యే యరపతినేని
● పిడుగురాళ్లలో జయహో బీసీ కార్యక్రమం


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, జనవరి 24 : అపార అనుభవం కలిగి రాష్ట్రాన్ని అన్ని విధాల సర్వతోముఖాభివృద్ధిగా పరిపాలన సాగించే చంద్రబాబు నాయుడు కావాలా.. అరాచకపాలన సాగిస్తున్న జగన్ కావాలా... ప్రజలు తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైనదని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక వల్లెల గార్డెన్‌లో బుధవారం జయహో బీసీ కార్యక్రమం జరిగింది. బీసీలకు సముచిత స్థానం కల్పించి రాజ్యాంగ పదవులు కల్పించిన ఘనత టీడీపీదేనన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఒక్క గురజాల నియోజకవర్గంలోనే 11 మంది హత్యగావింపబడ్డారని గుర్తు చేశారు. వైసీపీలో పెద్దలదే రాజ్యాధికారమని.... టీడీపీలో బీసీలకు కేంద్ర మంత్రి నుంచి రాష్ట్ర మంత్రుల వరకు పదవులు కేటాయించి సముచిత స్థానం కల్పించిన తెలుగుదేశం పార్టీ వైపే బీసీ సంఘాలు మరోసారి వెన్నంటి ఉండేందుకు సిద్ధంగా వున్నారన్నారు. ఐదేళ్లలో ముఖ్యమంత్రి జగన్ అపాయింట్‌మెంటే దొరకని బీసీ, ఎస్సీ ఎస్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు రాష్ట్రంలో ఉన్నారన్నారు. రేపటి ఎన్నికలలో నిశ్శబ్ద విప్లవంతో టీడీపీ విజయం సాధిస్తుందని, ఇప్పటి నుండే కష్టపడిన టీడీపీ కార్యకర్తలకు, బీసీ సంఘ నేతలకు స్థానిక సంస్థలలో పదవులు కేటాయింపులో అధిక ప్రాధాన్యత ఇస్తామని యరపతినేని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంటుపల్లి నాగేశ్వరరావు, పాటిబండ్ల చంద్రశేఖర్, బొమ్మనబోయిన నాగరాజు, అక్కినపల్లి బాలయ్య, మేకల సాంబశివరావు, తురకా వీరస్వామి, వేముల ఆంజనేయులు, బడిగుంచల వెంకటేశ్వర్లు, గండికోట వెంకటేశ్వర్లు, వల్లెపు రామకృష్ణ, ముశ్యం శ్రీను, పణితి రవి, పిల్లి చెన్నారావు, పాదర్తి రాజేశ్వరి, కామిశెట్టి రమేష్, పాల్గొన్నారు.

జానపాడును అభివృద్ధి చేసిన ఘనత టీడీపీదే

పిడుగురాళ్ల, జనవరి 24: జానపాడు గ్రామాన్ని అభివృద్ధి చేసిన ఘనత టీడీపీదేనని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం జానపాడు గ్రామంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఎస్సీ కాలనీలో పలు వీధులలో యరపతినేని, పార్టీ నేతలు పర్యటిస్తూ వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దళితులపై జరుగుతున్న దాడులు, అక్రమ కేసులను వివరించడంతో పాటు చంద్రబాబు అధికారంలోకి వస్తే దళితులకు, వివిధ సామాజికవర్గాలకు, ప్రతి కుటుంబానికి జరిగే లబ్ధి ఏమిటో వివరిస్తూ గ్యారంటీ కార్డులను యరపతినేని మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ టీడీపీ నేతలు యరపతినేని శ్రీనివాసరావుకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వున్నం వెంకటరావు, గండికోట వెంకటేశ్వర్లు, చింతలపూడి రామ్మూర్తి, వడ్డవల్లి సర్వేశ్వరరావు, ముప్పాళ్ల సాంబయ్య, వున్నం సురేష్, బండ్ల వెంకటేష్, ముప్పాళ్ల సురేష్, రత్నం, కృప, రత్తయ్య, మౌలాలి, ముజావర్, తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ విందుకు అంకారావుకు ఆహ్వానం

కారంపూడి, జనవరి 24: రిపబ్లిక్ డే సందర్భంగా కారంపూడికి చెందిన పర్యావరణ వేత్త కొమెర అంకారావు అలియాస్ జాజికి గవర్నర్ విందుకు ఆహ్వానం లభించింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి అంకారావుకు ఆహ్వానం అందింది. అంకారావు సేవలను గుర్తించిన గవర్నర్ ఈనెల 26వ తేదీన తేనీటి విందుకు ఆహ్వానించారు. అంకారావుకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు లభించడంతో పలువురు అభినందనలు తెలిపారు.

వెంకట్రామిరెడ్డిని కలుసుకున్న అధికారులు

మాచర్ల రూరల్, జనవరి 24 : మాచర్ల ఎస్ఈబీ సీఐగా కిషోర్, ఎస్ఐగా ప్రభాకర్, కారంపూడి సీఐగా చిన మల్లయ్య బాధ్యతలు చేపట్టారు. వీరు బుధవారం మాచర్లలోని వైసీపీ కార్యాలయంలో వైసీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛం అందించారు.

ఆటో బోల్తా : ఇద్దరి పరిస్థితి విషమం

మాచర్ల, జనవరి 24: వ్యవసాయ కూలీలతో వెళ్తున్న ఆటో బోల్తా పడిన సంఘటన మండలంలోని లచ్చంబావి వద్ద బుధవారం జరిగింది. పట్టణంలోని రైలుకట్ట ప్రాంతానికి చెందిన పది మంది వ్యవసాయ కూలీలు మిర్చి కోతల నిమిత్తం ఆటోలో లచ్చంబావికి బయలుదేరారు. గ్రామ సమీపంలోకి వెళ్లగానే ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ సంఘటనలో 8 మందికి గాయాలు కాగా వారిని పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వీరిలో ఇరువురి పరిస్థితి విషమంగా ఉండడంతో నరసరావుపేటకు రిఫర్ చేశారు. మాచర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీలోనే బీసీలకు సముచిత స్థానం : గుంటుపల్లి

నకరికల్లు, జనవరి 24 : బీసీలకు స్థానిక సంస్థల్లో, రాజకీయ పదవుల్లో అవకాశం కల్పించింది టీడీపీ మాత్రమేనని టీడీపీ రాష్ట్ర బీసీ నేత గుంటుపల్లి నాగేశ్వరరావు అన్నారు. బుధవారం రాత్రి నకరికల్లు టీడీపీ కార్యాలయంలో జయహో బీసీ సమావేశాన్ని నిర్వహించారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోతు శౌరయ్య, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించారు. బీసీ నేతలు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీలపై దాడులు పెరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నాదెండ్ల సత్యనారాయణ, మాజీ ఎంపీపీ సాగి కోటేశ్వరరావు, అహమ్మద్ బుడే, కరాలపాటి వలి, చల్లా పుల్లారావు, షేక్ మహమ్మద్ సా, ఇర్ల నాగ భూషణం, పాలడుగు శ్రీనివాసరావు, ఇర్ల నాగ భూషణం, ఇర్ల శ్రీహరి, నాదాల జాన్, వెంకట గురువులు, సంగుల అప్పారావు, ఢీకొండ మహానంది, దూదేకుల హుస్సేన్‌బీ, పలువురు బీసీ నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న గుంటుపల్లి నాగేశ్వరరావు

రిథమిక్ జిమ్నాస్టిక్స్ నేషనల్ ప్లేయర్‌కు సత్కారం

రాజుపాలెం, జనవరి 24 : మండలంలోని రెడ్డిగూడెం గ్రామానికి చెందిన క్రిష్టం ప్రభావతి కుమార్తె యజ్ఞశ్రీ ఆకులగణపవరం గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్లో 9వ తరగతి చదువుతుంది. యజ్ఞశ్రీ స్కూల్ గేమ్స్ నేషనల్ జిమ్నాస్టిక్స్‌లో రిథమిక్ జిమ్నాస్టిక్స్‌లో నేషనల్ ప్లేయర్‌గా రాణిస్తుంది. జాతీయ బాలికా దినోత్సవంను పురస్కరించుకొని బుధవారం నరసరావుపేటలోని టౌన్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ కె.శివశంకర్ చేతుల మీదుగా సత్కారం అందుకుంది. అదేవిధంగా మండలంలోని కొండమోడులో ఉన్న కేఎస్ఆర్ విద్యాసంస్థలు, పీఎస్ఆర్ డిగ్రీ కాలేజీలో జాతీయ బాలిక దినోత్సవం, అంతర్జాతీయ విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కోనేటి ప్రసన్ననరసింహారావు, డైరెక్టర్ బాడిశ మస్తాన్‌రావు, ఉపాధ్యాయులు ఎస్.నరసింహారావు, చిన్నబోయిన శ్రీనివాసరావు, దీపంగి సురేష్, వంగివరపు రాజా, నాగమల్లేశ్వరి, సోమశేఖర్ విద్యార్థులు పాల్గొన్నారు.

జూలకల్లు జడ్పీ విద్యార్థులకు ప్రథమ స్థానం

పిడుగురాళ్ల, జనవరి 24: నేషనల్ గర్ల్స్ చైల్డ్ డే సందర్భంగా జిల్లా స్థాయిలో నరసరావుపేటలో నిర్వహించిన వ్యాసరచన, డిబెట్, పెయింట్ పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచిన జూలకల్లు జడ్పీ విద్యార్థులను కలెక్టర్ లోతేటి శివశంకర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీ శ్రీకృష్ణదేవరాయలను కలసి ముస్లిం నేతలు

సత్తెనపల్లి, జనవరి 24 : ముస్లిం మైనార్టీ నేత సయ్యద్ మాబూ, మరికొందరు ముస్లిం యువకులు బుధవారం నరసరావుపేట వెళ్ళి ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలను కలసి తమ మద్దతును ప్రకటించారు. శ్రీకృష్ణదేవరాయలతో కలసి పయనిస్తామన్నారు.

అవార్డులు సేవలను మరింత విస్తృతం చేస్తాయి : చిన్నారావు

రెంటచింతల, జనవరి 24 : సమాజ సేవలో పునీతమైన వ్యక్తులకు అవార్డులందచేస్తే సేవలను మరింత విస్తృతం చేయడానికి ప్రోత్సహించిన వారమవుతామని చేయూత సోషల్ సర్వీసెస్ డైరక్టర్ డాక్టర్ వైఎస్ చిన్నారావు అన్నారు.విజయవాడలో బుధవారం రెంటచింతలకు చెందిన పాస్టర్ డాకూరి ప్రభుదాస్‌కు మదర్‌థెరిస్సా జాతీయ అవార్డును ప్రదానం చేశారు. కరోనా సమయంలో పేదలకు, అభాగ్యులకు చేసిన సేవలకు గుర్తుగా ఈ అవార్డును ఇస్తున్నట్లు సభికుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. అవార్డును అందుకున్న ప్రభుదాస్‌ను రత్నబాబు, మరియకుమార్, శేఖర్‌బాబు, సంధ్య సాగర్‌కుమార్, రాజీవ్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

ఆసరా కాదు.. అక్కచెల్లెమ్మలకు టోకరా

● మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి

పెదకూరపాడు, జనవరి 24 : నోరు తెరిస్తే అక్కా చెల్లెమ్మలంటూ కల్లబొల్లి కబుర్లు చెప్పే జగన్‌రెడ్డి ఆచరణలో అక్కా చెల్లెమ్మలకు టోకరా పెడుతున్నారని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంగన్‌వాడీలపై కక్ష కట్టి ఉక్కు పాదం మోపిన జగన్ ఆసరా పేరుతో తానేదో పొదుపు సంఘాలను ఉద్ధరిస్తున్నట్టు మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందన్నారు. రాష్ట్రంలో 1.14 కోట్ల మంది డ్వాక్రా మహిళలు ఉంటే 79 లక్షల మందికి ఆసరా అంటూ సకాలంలో డ్వాక్రా రుణాలు చెల్లించిన 75 శాతం మందికి టోకరా వేయటం, మోసం చేయటం కాదా? అని ప్రశ్నించారు. చంద్రన్న హయాంలో పొదుపు మహిళలకు 0 వడ్డీ ఐదు లక్షల వరకు వర్తింప చేశారని, అధికారంలోకి వస్తే పది లక్షలకు పెంచుతానని నమ్మించి అధికారంలోకి వచ్చిన తరువాత రూ.3 లక్షలకు కుదించి మహిళలను మోసం చేయటం కాదా అన్నారు. రూ.3 లక్షలకు కూడా సున్నా వడ్డీ కేంద్రమే భరిస్తుంది తప్పా జగన్ ఇచ్చింది ఏమి లేదన్నారు. టీడీపీ రుణమాఫీ చేయలేదంటూ జగన్ ప్రచారం చేయటం దుర్మార్గపు చర్య అన్నారు.

జయహో బీసీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

బెల్లంకొండ, జనవరి 24 : పెదకూరపాడు నియోజక వర్గంలోని క్రోసూరు మండలంలో ఈనెల 25వ తేదీన సాయంత్రం జరిగే జయహో బీసీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, బీసీ సంఘం మండల అధ్యక్షుడు గుంజా గంగారావు తెలిపారు. బెల్లంకొండ టీడీపీ కార్యాలయంలో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బీసీ సంక్షేమ పథకాలను రద్దు చేసి రూ.76వేల కోట్ల రూపాయలను దారి మళ్ళించారని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం మండల నాయకుడు గుడిసె కొండయ్య, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, ఓర్చు రాంబాబు, శ్రీనివాసరావు, బంగారయ్య, టీ.సత్యనారాయణ, సుబ్బయ్య, లక్ష్మయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యాదాత మురహరిరావు : మక్కపాటి

సత్తెనపల్లి రూరల్, జనవరి 24 : విద్యా దాత మురహరిరావు అని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మక్కపాటి రామచంద్రరావు అన్నారు. మండలంలోని రెంటపాళ్ళ హైస్కూల్ వ్యవస్థాపకులు మక్కపాటి వెంకట మురహరిరావు వర్ధంతిని బుధవారం పాఠశా లలో ఘనంగా నిర్వహించారు. రామచంద్రరరావుతో పాటు మురహరిరావు కుమార్తెలు ప్రసన్న, సునీత, అల్లుడు మల్లికార్జునరావు, పాఠశాల హెచ్ఎం బసవరాజు తదితరులు మురహరిరావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు అందించి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో చెన్నమల్లు వెంకయ్య, ఓర్చు సత్యనారాయణ, మక్కపాటి వీరయ చౌదరి, మక్కపాటి భాస్కర్, చెన్నమల్లు మోహన్‌బాబు, ఏకుల రాజశేఖర్, కొదముల కోటేశ్వరరావు, షేక్ పెదమాబు, మారిశెట్టి రామ సైదులు, వెంకటరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యవసాయ సిబ్బంది రైతులకు ఉత్తమ సేవలందించాలి

క్రోసూరు, జనవరి 24 : వ్యవసాయ సిబ్బంది తమ పని తీరును ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకొని రైతులకు ఉత్తమ సేవలు అందజేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళీ అన్నారు. క్రోసూరు సబ్ డివిజన్ పరిధిలోని వ్యవసాయ అధి కారులు, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది, వ్యవ సాయ సిబ్బంది సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో సాగవుతున్న పంటల వివరాలు, విస్తీర్ణం, ఈ పంట నమోదు, కేవైసీ, పీఎం కిసాన్, ఈకేవైసీ, ఎరువుల అమ్మకాలు, పంట కోత ప్రయోగాలు, కస్టమ్స్ హైరింగ్ సెంటర్ మొదలైన అంశాల గురించి నిశితంగా సమీక్షించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ రవి కుమార్, క్రోసూరు సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు వీ.హనుమంతరావు, వ్యవసాయ అధికారులు వీ.వేణుగోపాల్, వెంకటేశ్వరరావు, కృష్ణయ్య, వెంకట నరసయ్య, అహమ్మద్ పాల్గొన్నారు. వారితో పాటు నియోజక వర్గ ఉద్యాన వన శాఖ అధికారి, వైద్యాధికారులు, సివిల్ సప్లయిస్ అధికారులు హాజరయ్యారు.

పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శంకరరావు

అచ్చంపేట, జనవరి 24 : అచ్చంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలను పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు బుధవారం ప్రారంభించారు. అనంతరం చల్లగరిగ గ్రామంలో సచివాలయ భవనంతో పాటు హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను ప్రారంభించారు. చింతపల్లిలో సీసీ రోడ్లు, హెల్త్ వెల్‌నెస్ ఎంటర్, తాళ్ళచెరువులో సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. పెదపాలెంలో సచివాలయ భవనంతో పాటు 33/11కేవీ విద్యుత్ ఉప కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం కోనూరులో సీసీ రోడ్లు ప్రారంభించి జలజీవన్ మిషన్‌కు శంకుస్థాపన చేశారు. కోగంటివారి పాలెంలో హెల్త్ వెల్‌నెస్ సెంటర్, సచివాలయ భవనాన్ని ప్రారంభించిన అనంతరం అచ్చంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైఎస్ఆర్ ఆసరా చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయన సతీమణి వసంత కుమారి, మండల పార్టీ అధ్యక్షుడు చిలుకా చంద్రయ్య, జడ్పీటీసీ తుమ్మా విజయ ప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ భూక్యా రజినీ కృష్ణా నాయక్, కంభాల వీరబాబు, ఎస్‌కే జానీ, గంగసాని నరసింహారెడ్డి, చల్లా మంజు, ఎంపీడీవో స్వరూపరాణి, నెల్లూరు చంద్రబాబు, ఎక్కిరాల మురళీ పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 35 మంది ఎంపిక

పిడుగురాళ్ల, జనవరి 24 : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించారు. సుమారు 85 మంది హాజరుకాగా వివిధ విభాగాలలో 35 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సంజీవరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ కంపెనీల హెచ్ఆర్‌లు టీ.విజయకుమార్, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి ఎం.రవీంద్రనాయక్, సురేష్, శ్రీకాంత్‌తో పాటు కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వెంకట నరసయ్య, అధ్యాపకులు బాబురావు తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న రామ స్వామి, శేషగిరి కుమారి తదితరులు

వీరయ్య చౌదరికి ఘన నివాళి

సత్తెనపల్లి రూరల్, జనవరి 24 : సంగం డెయిరీ అభివృద్ధికి వీరయ్య చౌదరి కృషి చిరస్మరణీయమని మునిసిపల్ మాజీ చైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి ఎలినేడి రామస్వామి, సంగం డెయిరీ డైరెక్టర్ పోపూరి శేషగిరి కుమారిలు అన్నారు. మాజీ మంత్రి, సంగం డెయిరీ మాజీ చైర్మన్ దివంగత ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి వర్ధంతిని మండలంలోని రెంటపాళ్ళలో గల సంగం డెయిరీ పాల శీతలీకరణ కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. రామస్వామి, శేషగిరి కుమారి మాట్లాడుతూ డెయిరీ ఇంతగా అభివృద్ధి చెందిందంటే అప్పట్లో వీరయ్య చౌదరి కృషి అన్నారు. ముందుగా కేంద్రం ఆవరణలో ఉన్న వీరయ్య చౌదరి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఆళ్ళ అమరేశ్వరరావు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మక్కపాటి రామచంద్రరావు, కేంద్రం మేనేజర్ టీ.గోపీ, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి కోమటినేని శ్రీనివాసరావు, కట్టా రమేష్, ఆళ్ళ సాంబయ్య, మక్కపాటి భాస్కరరావు, ఎర్ర వెంకటేశ్వరరావు, కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.


చెక్కులను అందజేస్తున్న ధూళిపాళ్ల నరేంద్ర

● అమరావతి, జనవరి 24: సంగం డైయిరీ మాజీ చైర్మన్ దివంగత ధూళిపాళ్ల వీరయ్య చౌదరి 30వ వర్ధంతిని ఉంగుటూరు బీఎంసీలో ఘ నంగా నిర్వహించారు. దీంతో పాటు డీవీఎస్ అభయా వెల్ఫేర్ స్కీమ్ ద్వారా ఉంగు టూరు బీఎంసీ పరిధిలోని పెదపరిమి, నిడుముక్కల ఎంసీసీకి చెందిన రామినేని స్థానికబాబు, తలసిల రోశమ్మకు రూ.50 వేలు, రూ.10 వేల నగదు చెక్కులను సంగం డైయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర పంపిణీ చేశారు.

● రాజుపాలెం, జనవరి 24 : సంగం డెయిరీ అభివృద్ధి ప్రదాత దూళ్ళిపాళ్ల వీరయ్య చౌదరి అని డెయిరీ ఇన్‌చార్జ్ కె.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండలంలోని గంగిరెడ్డిపాలెం గ్రామ శివారులో ఉన్న సంగం డెయిరీలో వీరయ్య చౌదరి వర్ధంతి సందర్భంగా శ్రీనివాసరావు, క్వాలిటీ కంట్రో ల్ గుంటూరు డివిజన్ ఇన్‌చార్జ్ మౌలాలిలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో రామాంజినేయులు, సూపర్‌వైజర్లు ఇ.వెంకటేశ్వర్లు, కె.సుధీర్, సాంబశివరావు, లక్ష్మీనారాయణ, నరేష్, అనిల్ ఉన్నారు.

పరిటాల, వీరయ్య చౌదరికి ఘన నివాళి

సత్తెనపల్లి, జనవరి 24 : పట్టణంలోని రఘురామ్‌నగర్‌లో గల టీడీపీ ప్రజా వేదికలో బుధవారం టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు మాజీ మంత్రులు పరిటాల రవీంద్ర, ధూళ్ళిపాళ్ళ వీరయ్య చౌదరి వర్ధంతులను ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలకు టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు తాతా జయ ప్రకాష్ నారాయణ, టీడీపీ రాష్ట్ర నాయకులు ఎలినేడి రామస్వామి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చౌట శ్రీనివాసరావు, ఆతుకూరి నాగేశ్వరరావు, ఆళ్ళ అమరేశ్వరరావు, కటకం రామకృష్ణ, నూర్ బాషా జానీ బాబు, ఆళ్ళ సాంబయ్య, పూజల వెంకట కోటయ్య, రాంబో బుడే, దివ్వెల శ్రీను, నేముల ప్రకాష్, బలిజేపల్లి సురేష్, బందారు నాగరాజు, పత్తిపాటి హరేకృష్ణ, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

అక్కచెల్లెమ్మలంటూ నట్టేట ముంచిన మోసకారి జగన్

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు

నరసరావుపేట టౌన్, జనవరి 24: రాష్ట్రంలో అక్కచెల్లెమ్మలంటూనే వారిని నట్టేట ముంచిన మోసకారి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని, మహిళల అభయహస్తం నిధుల్నీ లాగేసుకున్న ఘనుడని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. జగన్ రాగానే డ్వాక్రా మహిళలకు సున్నావడ్డీ రాయితీని రూ.3లక్షలకు తగ్గించి, మద్య నిషేధం హామీని మరచి, నాసిరకం మద్యం సరఫరాచేసి ప్రజల ప్రాణాలు హరించాడని అన్నారు. కల్తీ మద్యంతో 30వేల మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మందుబాబుల్ని తాకట్టుపెట్టి అప్పులు తెచ్చిన ఘనత జగన్‌రెడ్డిదేనని, ఏ ముఖం పెట్టుకొని ప్రజల దగ్గరకెళ్ళి ఓటు అడుగుతారని అన్నారు. దేశంలో మహిళలపై జరిగే నేరాలలో మూడోవంతు ఏపీలోనే జరిగాయని, దిశా చట్టం జగన్ ప్రచార ఆర్భాటానికే పరిమితమైందని, మహిళలను ఉద్ధరించినట్లు జగన్ చెప్పుకోవడం మోసకారితనమేనని అన్నారు.

గణంత్ర దినోత్సవ రిహార్సల్స్‌ను పరిశీలించిన ఎస్పీ

నరసరావుపేట లీగల్, జనవరి 24: పట్టణంలోని మునిసిపల్ క్రీడా మైదానంలో ఈ నెల 26న నిర్వహించనున్న రిపబ్లిక్ డే వేడుకల రిహార్సల్స్‌ను బుధవారం నిర్వహించారు. రిహార్సల్స్‌ను ఎస్పీ వై రవిశంకర్‌రెడ్డి పరిశీలించారు. జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీ రామచంద్రరాజు ఆధ్వర్యంలో పోలీసు కవాతు రిహార్సల్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. జాతీయ గీతాన్ని ఆలపించిన అనంతరం పరేడ్ కమాండర్ ఆర్ఐ వెంకటరమణ ఎస్పీకి గౌరవ వందనం సమర్పించి కవాతు పరిశీలన కోసం ఆహ్వానించారు. పరేడ్ పరిశీలన వాహనంలో ఎస్పీ కవాతును పరిశీలించారు. అనంతరం పరేడ్ కమాండర్ ఆర్ఐ వెంకటరమణ సారథ్యంలో పోలీసు బలగాలు, ఎన్‌సీసీ, స్కౌట్ విభాగాలు మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్పీ రాఘవేంద్ర, డీఎస్పీలు మహేష్, చిన్నికృష్ణ, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



అదాలత్‌లో మాట్లాడుతున్న న్యాయాధికారి ఆశీర్వాదం పాల్

సబ్ జైలులో జైలు అదాలత్

నరసరావుపేట లీగల్, జనవరి 24: స్థానిక ప్రత్యేక శ్రేణి ఉపకారాగారంలో బుధవారం జైలు అదాలత్ నిర్వహించారు. న్యాయాధికారిగా పాల్గొన్న ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి ఆశీర్వాదం పాల్ మాట్లాడుతూ ఖైదీలకు చట్టపరంగా ఏర్పాటు చేసిన హక్కులు, సంక్షేమ పథకాలను వివరించారు. ఆహారం, వైద్యం, పారిశుధ్యం తదితర అంశాలను విచారించారు. ఫిర్యాదుల పెట్టెను పరిశీలించారు. కార్యక్రమంలో న్యాయవాదులు హనుమంతరావు, బ్లెసీనా, సబ్ జైలు అధికారి వెంకటేశ్వర స్వామి తదితరులు పాల్గొన్నారు.



పేదల ఆకలి తీరుస్తున్న ప్రత్తిపాటి ఫౌండేషన్ అన్న క్యాంటీన్

కళ్యాణి సెంటర్‌లో ప్రత్తిపాటి ఫౌండేషన్ అన్నదానం

చిలకలూరిపేట అర్బన్, జనవరి 24: పట్టణంలోని కళ్యాణి సెంటర్‌లో ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్ సేవలు కొనసాగుతున్నాయి. బుధవారం ఈ అన్న క్యాంటీన్‌లో 647మందికి భోజన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు షేక్ కరీం, టి.సుభానీ, షేక్ ఉమర్, షేక్ ఖాజా, టైలర్ ఖాజావలి, షేక్ మస్తాన్‌వలి, షేక్ అన్సర్, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, జవ్వాజి బుజ్జిబాబు తదితరులు పాల్గొని స్వచ్ఛందంగా సేవలు అందించారు.

సీనియర్ నాయకుడి కుటుంబానికి ఆర్థికసాయం

చిలకలూరిపేట అర్బన్, జనవరి 24: చిలకలూరిపేట పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు వడ్డని సుబ్బారావు మరణించటంతో వారి కుటుంబానికి మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తన సానుభూతిని తెలియజేశారు. ప్రత్తిపాటి ఫౌండేషన్ ద్వారా రూ.10వేలు ఆర్థికసాయాన్ని అందించారు. కార్యక్రమంలో పిల్లి లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ నెట్‌బాల్ పోటీలకు బొప్పూడి విద్యార్థినుల ఎంపిక

చిలకలూరిపేట, జనవరి 24: చిలకలూరిపేట మండలం బొప్పూడిలోని పూసల సుబ్బయ్య, గుంటు వెంకటప్పయ్య జడ్పీ హైస్కూల్ విద్యార్థినులు దగ్గుమల్లి భానుప్రియ, రంగశెట్టి కీర్తి జాతీయ నెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఒంగోలు రాష్ట్ర నెట్‌బాల్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో వారు విశేష ప్రతిభ చూపి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఈ నెల 25నుంచి 29వ తేదీ వరకు జరిగే జాతీయ నెట్‌బాల్ పోటీల్లో వారు పాల్గొననున్నారు. వీరిని గ్రామ సర్పంచ్ రమేష్, ఛైర్మన్ పీ బుడ, హెచ్‌ఎం బీ వెంకటేశ్వర్లు, పీడీ నాగమణి, స్కూల్ ఉపాధ్యాయులు అభినందించారు.



జాతీయ నెట్ బాల్ పోటీలకు ఎంపికైన బొప్పూడి హైస్కూల్ విద్యార్థినులు

ఆధారాలు లేని 14.5లక్షల నగదు స్వాధీనం

శావల్యాపురం, జనవరి 24: సరైన ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.14.5లక్షల నగదును పోలీసులు గుర్తించి సీజ్‌చేసిన సంఘటన మండలంలోని గంటవారిపాలెం వద్ద మంగళవారం రాత్రి జరిగింది. ఎస్ఐ తుళ్ళూరి తిరుపతిరావు తెలిపిన వివరాల మేరకు పోలీసులు పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి మార్గంలోని గంటవారిపాలెం చెక్‌పోస్ట్ వద్ద మంగళవారం వాహనాలు తనిఖీచేస్తుండగా గుంటూరు నుంచి దోర్నాలకు కారులో వెళుతున్న ఏడుకొండలు అనే వ్యక్తి ఆపి తనిఖీ చేయగా అతని వద్ద రూ.14.5లక్షల నగదును ఉన్నట్లు గుర్తించామని, దానికి తగిన ఆధారాలు చూపమని అడిగితే మిరపకాయలు అమ్మిన డబ్బు తెచ్చుకొంటున్నానని తెలిపాడని, కానీ దానికి సంబంధించిన బిల్లులు కానీ లేదా ఏ విధమైన ఆధారాలు చూపకపోవడంతో నగదు మొత్తాన్ని సీజ్‌చేసి ఆదాయపు పన్ను శాఖవారికి అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

మాచవరంలో బాబు ష్యూరిటీ పై ప్రచారం

రొంపిచర్ల, జనవరి 24: తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ అరవిందబాబు పేర్కొన్నారు. మండలంలోని మాచవరంలో మంగళవారం రాత్రి బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావుతో కలసి ఆయన పర్యటించారు. కార్యక్రమంలో పులుకూరి జగ్గయ్య, శాఖమూరి రామ్మూర్తి, కె.కొండలు, పి.నాగిరెడ్డి, ఎం.వెంకటేశ్వరరెడ్డి, వై. కోటిరెడ్డి, పోతిరెడ్డి అంజిరెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



మాచవరంలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న అరవిందబాబు

15 మద్యం సీసాలు స్వాధీనం

నరసరావుపేట లీగల్, జనవరి 24: మండలంలోని జొన్నలగడ్డలో మంగళవారం రాత్రి 15అక్రమ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు నరసరావుపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ నయనతార తెలిపారు. నిందితుడు శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నామని, కోర్టులో ప్రవేశ పెట్టనున్నట్టు ఆమె తెలిపారు.

రేపు కొండవీడు ఈఎన్‌టీ వైద్యశాలలో వైద్య శిబిరం

నరసరావుపేట లీగల్, జనవరి 24: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ నెల 26న పట్టణంలోని కొండవీడు ఈఎన్‌టీ వైద్యశాలలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్టు వైద్యశాల నిర్వాహకులు డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం తెలిపారు. శిబిరంలో వినికిడి లోపం ఉన్న వారికి ఉచితంగా పరీక్షలు చేస్తామన్నారు. వినికిడి పరికరాలపై 30శాతం రాయితీ ఇస్తామన్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు గుంటూరు రోడ్డులోని తమ వైద్యశాలలో ఈ శిబిరం నిర్వహిస్తామన్నారు. సమావేశంలో డాక్టర్ రామ్మోహనరెడ్డి, కోటిరెడ్డి, డాక్టర్ నాగేశ్వరరావు, భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వీరయ్య చౌదరి, పరిటాల రవీంద్రలకు ఘన నివాళి



వీరయ్య చౌదరి, పరిటాల రవీంద్ర చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు, డాక్టర్ చదలవాడ, డాక్టర్ లలిత్ సాగర్ తదితరులు

నరసరావుపేట టౌన్, జనవరి 24: భూస్వాములు, పెత్తందారులు పేద బడుగు బలహీనవర్గాల శ్రమను దోపిడీ చేస్తుంటే బలహీనవర్గాలకు పరిటాల రవీంద్ర అండగా నిలిచారని టీడీపీ నియోజవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. బుధవారం మాజీమంత్రి పరిటాల రవీంద్ర 19వ వర్ధంతి సందర్భంగా నరసరావుపేట టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ పెత్తందారుల పెత్తనాన్ని వ్యతిరేకించి బూర్జువా పార్టీల శాసనాలకు బూజు పట్టించి బంజరు భూములను పేదలకు పంచిపెట్టిన మహనీయుడు పరిటాల రవీంద్ర అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తెలుగు యువత అధ్యక్షుడు కుమ్మెత కోటిరెడ్డి, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ పులిమి రామిరెడ్డి, రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి వనమా శివ, మాజీ ఎంపీపీ కడియం కోటిసుబ్బారావు, వనమా పవన్, యల్లమంద రెడ్డి, చుక్కపల్లి చంద్రమౌళి, తిరుమలశెట్టి వెంకటేశ్వర్లు, మాతంగి బంగారం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

● నరసరావుపేట టౌన్: పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలోని టీడీపీ జిల్లా కార్యాయలంలో బుధవారం మాజీ మంత్రి ధూళిపాళ వీరయ్య చౌదరి, పరిటాల రవీంద్ర వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి, పరిటాల రవీంద్ర చిత్రపటాలకు టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు, గోనుగుంట్ల కోటేశ్వరరావు, యువ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్‌కుమార్‌లు నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొట్టిపాటి జనార్ధనబాబు, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ మహమ్మద్ రఫీ, జీపీకుమార్, మధు, క్రాంతి, రమేష్, కె.విజయ్, వి.బాబురావు పాల్గొన్నారు.



వినుకొండలో పరిటాల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షుడు మౌలానా ముస్తక్ అహమ్మద్ తదితరులు

● నరసరావుపేట టౌన్: పట్టణంలోని సంగం డెయిరీ పాలశీతలీకరణ కేంద్రంలో మాజీమంత్రి ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి 30వ వర్ధంతి బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరానికి ముఖ్యఅతిథి ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ కే రాంబాబు ప్రారంభించారు. పల్నాడు బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో 85మంది రక్తదానం చేశారని నరరావుపేట శీతలీకరణ కేంద్రం మేనేజర్ వీరేంద్రకుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎం.గంగాధర్, సంగం డెయిరీ పాలకవర్గ సభ్యులు కట్టా జగన్‌మోహన్‌రావు, గడిపూడి ఆంజనేయులు, పోపూరి శేషగిరికుమారి వినుకొండ, గురజాల, ప్రకాశం జిల్లా, రెంటపాళ్ళ మేనేజర్‌లు నాగప్రభు, రంగారావు, సురేష్, గోపి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

● వినుకొండ: మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు పరిటాల రవీంద్ర 19వ వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ముందుగా రవీంద్ర చిత్రపటానికి టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షుడు మౌలానా ముస్తక్ అహమ్మద్ కార్యకర్తలతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పేద,బడుగు, బలహీన వర్గాలను భూస్వాములు, పెత్తందారులు శ్రమదోపిడీ చేస్తుంటే పేదలకు అండగా నిలిచి పోరాటాలు చేసిన గొప్ప వ్యక్తి పరిటాల రవీంద్ర అని కొనియాడారు. అనంతరం ధూళిపాళ్ల వీరయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో టీడీపీ సీనియర్ నాయకులు సైదారావు, నలబోలు రామకోటేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్, పెమ్మసాని నాగేశ్వరరావు, పి.వి.సురేష్, గన్నమనేని వెంకయ్య, గద్దె వీరమస్తాన్‌రావు, గంగినేని ఆంజనేయులు, వంకాయలపాటి పేరయ్య, పాలెపోగు బాలగురవయ్య, గోరంట్ల హనుమంతరావు, రియల్‌ఎస్టేట్ జానీ, బత్తుల గోవిందరాజులు, నంబుల గుర్నాథం, నలబోలు శ్రీనివాసరావులతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఉద్యోగుల జీతాలు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి

టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రఘురామరాజు

నరసరావుపేట టౌన్, జనవరి 24 : లోటు బడ్జెట్‌లో కూడా ఒక్కరోజు కూడా ఆలస్యంకాకుండా జీతం ఇచ్చిన ఘనత చంద్రబాబు నాయుడుదైతే సైకో జగన్ పాలనలో ఉద్యోగులకు జీతాలు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి దాపురించిందని టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు అన్నారు. కార్మికచైతన్య యాత్రలో భాగంగా బుధవారం పల్నాడు జిల్లా కేంద్రం నరరావుపేటలోని టీడీపీ జిల్లా కార్యాలయం ఆవరణలో టీఎన్‌టీయూసీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గొట్టుముక్కల రఘురామరాజు మాట్లాడుతూ భవన నిర్మాణరంగ కార్మికులు టీడీపీ హయాంలో వారంలో ఏడు రోజులు, 24గంటలు పనిచేసినా వారికి పని ఉండేదన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని, కృష్ణపట్నం ఓడరేవును ప్రైవేటుపరం చేశారని, అక్కడ కార్మికులను తీసివేశారని అన్నారు. పెరిగిన నిత్యావసర ధరల వల్ల జీతాలు సరిపోని పరిస్థితి ఉందని, జీతాలు పెంచమని అంగన్‌వాడీలు, మున్సిపల్‌కార్మికులు, డ్వాక్రా మహిళలు పోరాటం చేశారన్నారు. ఈ రాష్ట్రానికి పట్టిన శని, దరిద్రం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. యువ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ మాట్లాడుతూ దగాపడిన కార్మికుడా మేలుకో అంటూ టీఎన్‌టీయూసీ చేపట్టిన కార్మిక చైతన్య యాత్ర జయప్రదం కావాలని ఆకాంక్షించారు. కార్మిక చైతన్యయాత్ర బస్సును జెండా ఊపి డాక్టర్ లలిత్‌సాగర్, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు భాషా ప్రారంభించారు. కార్యక్రమంలో జాస్తి చంద్రశేఖర్, గోనుగుంట్ల కోటేశ్వరరావు, గొట్టిపాటి జనార్ధన్‌బాబు, కొట్టా కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి కార్మిక చైతన్యయాత్రను ప్రారంభిస్తున్న డాక్టర్ లలిత్‌సాగర్, టీఎన్‌టీయూసీ బాషా తదితరులు

ప్రజాసమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం: ముప్పాళ్ల

వినుకొండ టౌన్, జనవరి 24: రాష్ట్రంలో మద్యపానాన్ని నిషేధించి ఎన్నికలకు వెళ్తామని హామీఇచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో జగన్ బ్రాండ్‌లతో రసీదులు, బిల్లులు లేకుండా మద్యం పేరుతో దోచుకుంటున్నారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. ప్రజా సమస్యలపై సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన మహాధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించే పార్టీలతో కలిసి పోరాడతామని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే బొల్లాపై తీవ్ర విమర్శలు గుప్పించారు. వినుకొండలో ముస్లింల మధ్య చిచ్చురేపి యువకుల భవిష్యత్ పాడుచేస్తున్నారని ఆయన విమర్శించారు. గతంలో తనపై బొల్లా చేసిన అవినీతి ఆరోపణలపై ఆయన సవాల్‌విసిరారు. ఆజాద్ నగర్ కాలనీవాసులకు మౌలిక వసతులు కల్పించి, ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలంటూ తహసీల్దార్ కార్యాలయంలోని డీటీ అబ్బూరి వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు.

కార్యక్రమంలో పల్నాడు జిల్లా సీపీఐ కార్యదర్శి మారుతివరప్రసాద్, రాము, శ్రీనివాసరావు, లాల్‌ఖాన్, రామారావు, వందనం, పవన్ కుమార్, మస్తాన్, షేక్ మల్లికా, బాషా, ముస్తఫా, వెంకటేశ్వర్లు, జక్రయ్య, రమణ, రూతమ్మ, కాశమ్మ, దుర్గ తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయకార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు



సభలో ప్రసంగిస్తున్న పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్

చదువుకునే వయసులో పెళ్లి మంచిది కాదు

● బాలికా దినోత్సవంలో కలెక్టర్

నరసరావుపేట కల్చరల్, జనవరి, 24: ఆడపిల్లలు చదువుకునే వయసులో పెళ్లిచేయడం మంచిది కాదని పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి తల్లిదండ్రులకు హితవు పలికారు. బుధవారం స్థానిక భువన చంద్ర టౌన్ హాల్‌లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, బాల సంరక్షణ విభాగం, విద్యా, వైద్య ఆరోగ్య శాఖ, ఎంఎస్‌కేకే, డీఆర్‌డీఏ పల్నాడు జిల్లా ఆధ్వర్యంలో జరిగిన జాతీయ బాలికా దినోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆడపిల్లలు అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని, అలాంటి వారి గురించి వెంటనే తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, డీఎంహెచ్‌వో రవి, బాలల సంరక్షణ అధికారి విజయ్ కుమార్, డీసీసీవో విజయ్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్, పలువురు జిల్లా అధికారులు దిశ పోలీస్ స్టేషన్ ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

బత్తిన గార్డెన్స్‌లో కాపు ఆత్మీయ సమావేశం

నరరావుపేట టౌన్, జనవరి 24: పట్టణంలోని బత్తిని గార్డెన్స్‌లో కాపు ఆత్మీయ సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశానికిక జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదల నాగేంద్రబాబు హాజరయ్యారు. అనంతరం ప్రత్యేకంగా జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీ, కొణిదల నాగేంద్రబాబు సమావేశమయ్యారు. కార్యక్రమంలో జనసేన అభిమానులు, కాపు నాయకులు పాల్గొన్నారు.

నామమాత్రంగా బడ్జెట్ సమావేశాలు

వినుకొండ టౌన్, జనవరి 24: స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఛైర్‌పర్సన్ డాక్టర్ దస్తగిరి అధ్యక్షతన బడ్జెట్ సమావేశం నామమాత్రంగా నిర్వహించారు. 2023-24లో రాబడి అంచనాలు రూ.14,27,45,000లు, వ్యయం రూ.12,54,54,000లు, 2024-25లో రాబడి అంచనాలు రూ.15,15,07,000లు, వ్యయం రూ. 13,29,79,000లను, రాబడి, ఆదాయాల గురించి కేవలం అరగంటలో కౌన్సిలర్లకు వివరించారు. ఆసాంతం బడ్జెట్ నివేదికలో ఇచ్చిన అంశాలను సభ దృష్టికి తీసుకురాకుండానే అన్ని అంశాలను ఆమోదించినట్లు సభను ముగించడం గమనార్హం. సమావేశాన్ని కేవలం 13మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. సభ అనంతరం ఛైర్‌పర్సన్ దస్తగిరి ఆవేశంగా కార్యాలయం నుంచి బయటకు వెళ్లిపోయారు.

అంగన్‌వాడీ కార్యకర్త అనుమానాస్పద మృతి

మతుకుమల్లి (శావల్యాపురం) జనవరి 24: అనుమానాస్పదరీతిలో అంగనవాడీ కార్యకర్త ఆత్మహత్య చేసుకొన్న సంఘటన శావల్యాపురం మండలం మతుకుమల్లి గ్రామంలో బుధవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు గ్రామంలోని చింతలబీడులోని బీసీ అంగన్‌వాడీ సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న చిలువూరి జ్యోతిప్రసన్న బుధవారం ఉదయాన్నే అంగన్‌వాడీ సెంటర్‌కు వెళ్ళింది. మధ్యాహ్నం భోజనానికి ఇంటికెళ్ళి తిరిగి వచ్చింది. సాయంత్రం 4గంటల సమయంలో గత 40రోజుల నుంచి సెంటర్‌లో రికార్డులన్నీ పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే పూర్తి చేయాలని చెప్పి అంగన్‌వాడీ ఆయాను, పిల్లల్ని సెంటర్ నుంచి అరగంట ముందుగానే ఇంటికి పంపించింది. రాత్రి 7.30గంటలైనా తల్లి ఇంటికి రాకపోవడంతో కుమారులు అంగనవాడీ కేంద్రానికి వచ్చి చూడగా జ్యోతి ప్రసన్న లోపల ఉరేసుకొని కనిపించింది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. జ్యోతి ప్రసన్న మృతిపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేశారు. పూర్తి సమాచారం ఇంకా తెలియరాలేదు.




జ్యోతి ప్రసన్న (ఫైల్‌ఫొటో)

ప్రొటోకాల్ పాటించని అధికారులు

● అధికారిక కార్యక్రమాల్లో ఎమ్మెల్యేకు బదులు తనయుడు, ప్రజాప్రతినిధులకు బదులు కుటుంబ సభ్యులు

● అపహాస్యం పాలవుతున్న ప్రజాస్వామ్యం

వినుకొండ, జనవరి 24: స్థానిక లయోలా పాఠశాలలో ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలను అధికారులు బుధవారం ప్రారంభించారు. పోటీలకు ఎమ్మెల్యే తనయుడు గిరిబాబుతో పాటు, ఎంపీపీ జయశ్రీ భర్త పగడాల వెంకటరామిరెడ్డి, జడ్పీటీసీ విజయలక్ష్మి భర్త రాజా, మున్సిపల్ ఛైర్‌పర్సన్ దస్తగిరి సతీమణి షకీలా, షాజీలు ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొని ఆటలను ప్రారంభించారు. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల సౌకర్యాన్ని ఎన్నికల గెలుపోటముల కోసమే ఉపయోగించారే తప్ప అనంతరం గెలుపొందిన అభ్యర్థులకు విలువలేకుండా పోయింది. అధికారులు ప్రొటోకాల్ పాటించకపోవడంపై ప్రజలు వారి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటు మున్సిపాలిటీ కార్యాలయాల్లో కూడా భార్యకు బదులు భర్తలు, భర్తకు బదులు భార్యలు ప్రభుత్వ అధికార కార్యక్రమాల్లో కుర్చీలపై ఆసీనులవుతున్నా అధికారులు పట్టించుకోకపోవటంతో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతోంది.



క్రీడాకారుల పరిచయ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తనయుడు గిరిబాబు

టీడీపీతోనే బీసీలకు మేలు

● జయహో బీసీ సభలో మాజీ మంత్రి ప్రత్తిపాటి



టీడీపీలో చేరుతున్న వారిని కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ప్రత్తిపాటి

ఉప్పరపాలెం (యడ్లపాడు), జనవరి 24: బీసీలకు మేలు చేసింది.. చేయబోయేది తెలుగుదేశం మాత్రమేనని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. యడ్లపాడు మండలం ఉప్పరపాలెంలో మంగళవారం రాత్రి జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగసభలో ప్రత్తిపాటి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బీసీ నాయకత్వానికి తెలుగుదేశం పార్టీ పుట్టినిల్లు అని, నాటి నుంచి నేటివరకు అదే సాంప్రదాయాన్ని పార్టీ కొనసాగిస్తున్నదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారానికి తెలుగుదేశం ఏం చేయబోతున్నదో తెలియచేసేందుకు జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

టీడీపీలోకి 30 వైసీపీ కుటుంబాలు

యడ్లపాడు మండలం ఉప్పరపాలెం గ్రామానికి చెందిన 30 వైసీపీ కుటుంబాలు మంగళవారం రాత్రి గ్రామంలో జరిగిన జయహో బీసీ బహిరంగసభ సందర్భంగా టీడీపీలో చేరాయి. పార్టీలో చేరినవారికి ప్రత్తిపాటి పార్టీ కండువాలను కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త తోట రాజారమేష్, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు కామినినేని సాయిబాబు, టీడీపీ నాయకులు పల్లపు అంకమ్మ, వెంకట్రావు, మద్దూరి వీరారెడ్డి, జనసే, టీడీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మౌలిక వసతులకు ప్రాధాన్యం ఇవ్వాలి: ఎంపీపీ

యడ్లపాడు, జనవరి 24: యడ్లపాడు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ పిడతల ఝాన్సీదయాసాగర్ అధ్యక్షతన బుధవారం జరిగింది. ముందుగా ఇన్‌చార్జి ఎంపీడీవో వరూధిని ఎజెండా అంశాలను సభ్యులకు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో మౌలికవసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి యాక్షన్ ప్లాన్‌ను రూపొందించుకుని పనులు చేపట్టి నిర్వహిస్తే పూర్తయిన 48గంటల్లోగా చెల్లింపులు జరిపేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఈఅంశాలను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో ప్రాధాన్యక్రమంలో పనులను గుర్తించాలని సూచించారు.